


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 19-04-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 214 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## అప్పన్న నిజరూప దర్శనంతో

# పులకించిన భక్తజనం



### అంగరంగ వైభవంగా చందనోత్సవ వేడుకలు



- తొలిదర్శనం చేసుకున్న దేవాలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు
-రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టు వస్త్రాలు, చందనాన్ని సమర్పించిన ఉప ముఖ్యమంత్రి కె.ఇ.కృష్ణమూర్తి
- ప్రణాళికబద్ధమైన క్యూలైన్లతో స్వామివారిని శీఘ్రంగా దర్శించుకున్న భక్తులు
- ఏర్పాట్లు అద్భుతమని ప్రశంసించిన పలువురు భక్తులు


**చందన స్వామి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షం : స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి**





వార్త 2లో..

## ప్రపంచంలో అత్యంత అందమైనది బాలల చిరునవ్వే



- స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ళవుతున్నా అత్యాచార దుర్ఘటనలు సిగ్గు చేటు
- బాలికలకు భద్రత కల్పించడం సమాజం బాధ్యత
- బాలికలు కామన్వెల్త్ గేమ్స్‌లో దేశానికి మంచి పేరు తీసుకొచ్చారు

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

న్యూఢిల్లీ : జమ్మూ-కశ్మీరులోని కదువాలో జరిగిన అత్యాచారం సంఘటనపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ళవుతున్నా ఇలాంటి దుర్ఘటనలు జరగడం సిగ్గు చేటు అని పేర్కొన్నారు. జమ్మూ-కశ్మీరులోని కాట్రాలో శ్రీ మాతా వైష్ణో దేవి విశ్వవిద్యాలయం 6వ స్నాతకోత్సవంలో బుధవారం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ళు గడచిన తర్వాత ఇలాంటి సంఘటనలు దేశంలోని ఏ ప్రాంతంలో జరిగినా సిగ్గు

తరువాయి 2లో

## గన్‌మెన్లను వెనక్కి పంపిన పవన్‌కల్యాణ్

అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తన గన్‌మెన్లను వెనక్కి పంపారు. నెలరోజుల క్రితమే పవన్.. తనకు భద్రత కల్పించాలని కోరుతూ డీజీపీ మాలకొండయ్యకు లేఖ రాశారు. అందుకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం పవన్‌కు నలుగురు గన్‌మెన్లను కేటాయించింది. రెండు షిప్టుల్లో ఇద్దరు గన్‌మెన్లు పనిచేసేలా విధులు కేటాయించారు. అయితే పవన్ తన గన్‌మెన్లను వెనక్కి వెళ్లిపోవాలని కోరారు. పార్టీ వ్యవహారాలు చేరవేసేందుకు ప్రభుత్వం గన్‌మెన్లను వాడుకుంటోందని జనసేన వర్గాలు అనుమానిస్తున్నాయి. అందుకోసమే వారిని వెనక్కు పంపినట్లు తెలుస్తోంది.

## భారత్-బ్రిటన్ సంబంధాలకు

# నూతన జవసత్వాలు

### ప్రధాని మోదీ



లండన్ : భారత్-బ్రిటన్ సంబంధాలకు నూతన జవసత్వాలు జతకూడుతాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బుధవారం ఆయన బ్రిటన్ ప్రధాన మంత్రి థెరేసా మేతో చర్చలు జరిపారు. థెరెసాతో ఆయన మాట్లాడుతూ నేటి సమావేశం తర్వాత ఇరు దేశాల సంబంధాలకు నూతన జవసత్వాలు జతకూడుతాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సౌర కూటమిలో బ్రిటన్ భాగస్వామి అవుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. దీనివల్ల వాతావరణ మార్పులతో పోరాడటం మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాలవారి పట్ల మన బాధ్యతను నిర్వహించినట్లవుతుందన్నారు. 12వ శతాబ్దం నాటి సాంఘిక సంస్కర్త బసవేశ్వరుని జయంత్యుత్సవాల సందర్భంగా ఆయనను విశ్వసించేవారిని కలవడం తనకు చాలా ఆనందంగా ఉందని మోదీ చెప్పారు. థెరెసా మే మాట్లాడుతూ భారతదేశం, బ్రిటన్ ప్రజల కోసం

తరువాయి 2లో

## మోదీజీ.. మాట తీరు మార్చుకోవాలి

- కల్లోలం సృష్టిస్తున్న అంశాలపై నోరు విప్పరేం?
- మీకు త్వరలోనే జ్ఞానోదయం కావాలని కోరుకుంటున్న
- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్



న్యూఢిల్లీ : మాట తీరు మార్చుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీకి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సూచించారు. తనను మౌన్ మోహన్ సింగ్ అని మోదీ సంబోధించడంపై మన్మోహన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మన్మోహన్ మాట్లాడుతూ... నేను మాట్లాడటం లేదని నన్ను మౌన్ మోహన్ సింగ్‌గా సంబోధించారు. మాట్లాడటం నేర్చుకోవాలని నాకు సలహా ఇచ్చారు. ఇప్పుడు

తరువాయి 2లో

## కంభంపాటి హరిబాబుకు కొత్త పదవి



అమరావతి: బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడి పదవికి రాజీనామా చేసిన విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మూడేళ్లు పనిచేసిన హరిబాబు రెండు రోజుల క్రితం ఆ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆయన రాజీనామా అంశం సర్వత్రా చర్చనీయాంశమైంది. పార్టీలో అంతర్గతంగా వస్తున్న విమర్శలు నేపథ్యంలో మనస్తాపం చెంది పార్టీ పదవికి హరిబాబు రాజీనామా చేసి ఉంటారనే వాదన బలంగా వినిపించింది. అయితే మిత్రపక్షం టీడీపీతో చెడిన తర్వాత

తరువాయి 2లో



# అప్పన్న నిజరూప దర్శనంతో

# పులకించిన భక్తజనం



## అంగరంగ వైభవంగా చందనోత్సవ వేడుకలు



సింహాచలం : ఉత్తరాంధ్రా జిల్లాల ప్రజలకే కాకుండా, ఒడిస్సా, చత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి వారి చందనోత్సవ వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. సింహగిరిపై కొలువైవున్న శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి వారు ఏడాది పొడవునా సుగంధ పరిమళభరిత చందన పూతతో దర్శనమిచ్చే స్వామి ఒక్క చందనోత్సవం రోజునే నిజరూపదర్శనంలో భక్తులకు కటాక్షిస్తారు. ఏడాదికి ఒక్కసారి వైశాఖ శుక్లపక్ష తదియ పర్వదినాన నిజరూపంలో దర్శనమిచ్చే శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి వారిని దర్శించుకుని భక్తజనం పులకించిపోయారు. బుధవారం తెల్లవారుజామున ఒంటిగంట సమయాన వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారిని సుప్రభాత సేవలో మేల్కొల్పారు. పురోహితులు కళ్లకు గంతలు కట్టుకుని బంగారు, వెండి బొరిగెలతో స్వామి వారి దేహంపై నున్న చందనాన్ని తొలగించారు. నూతనంగా అరగతీసిన చందనాన్ని స్వామి వారి దేహం, ఎదపై ఉంచారు. అనంతరం సుమారు గం.1.55ని.ల సమయంలో దేవాలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులతో వచ్చి స్వామి వారిని తొలిదర్శనం చేసుకున్నారు. ఉపముఖ్యమంత్రి మరియు ఇన్‌ఛార్జి దేవాదాయ ధర్మదాయశాఖ మంత్రి కె.ఇ.కృష్ణమూర్తి దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు, చందనాన్ని సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరపున ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనిల్‌కుమార్ సింఘాల్, రాష్ట్ర మంత్రులు గంటా శ్రీనివాసరావు, కొల్లు రవీంద్ర పట్టువస్త్రాలు, చందనాన్ని సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు.

వీరితో పాటు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలం భవాని భాస్కర్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గాదె శ్రీనివాసుల నాయుడు, పివిఎన్.మాధవ్, బండారు సత్యనారాయణమూర్తి, పివిజిఆర్.నాయుడు, వాసుపల్లి గణేష్‌కుమార్ తదితర ప్రజా ప్రతినిధులతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ జి.సృజన, ఎం.టి.కృష్ణబాబు, సి.పి.యోగానంద్, ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ, డిఐజి శ్రీకాంత్ తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కె.ఇ.కృష్ణమూర్తి మాట్లాడుతూ రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్యం, దేవాదాయశాఖు సమన్వయంతో వ్యవహరిస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అద్భుతమైన ఏర్పాటు చేశారని అభినందించారు. రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం సాధారణ భక్తులకు పెద్దపీట వేశామని, స్వామివారిని వారు శీఘ్రంగా దర్శించుకునేందుకు వీలుగా ప్రముఖుల అంతరాలయ ప్రవేశాన్ని నిషేధించామని తెలిపారు.







### ఏర్పాట్లు అద్భుతమంటూ సంతృప్తిని వ్యక్తం చేసిన భక్తులు

చందనోత్సవ వేడుకలకు జిల్లా యంత్రాంగం ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేసినందున ఎటువంటి సమస్యలు లేకుండా స్వామివారిని చక్కగా దర్శించుకున్నామని పలువురు భక్తులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

కొంతమంది వివిఐపిలు మినహా ఇంకెవ్వరినీ గర్భగుడిలోకి అనుమతించకపోవడం వల్ల రూ.200లు, రూ.500లు, రూ.1,000లు టికెట్లు కొన్న భక్తులతో పాటు దర్మదర్శనం క్యూలోని భక్తులకు కూడా స్వామి వారి దర్శనం చక్కగా జరిగిందని హర్షాన్ని వ్యక్తం చేశారు. పోలీసు బందోబస్తుతో పాటు ట్రాఫిక్ నియంత్రణ ప్రణాళిక బద్ధంగా నిర్వహించడంతో పాటు ఉచిత బస్సుల ద్వారా భక్తులను కొండపైకి చేరవేయడం వల్ల భక్తులు ఏ మాత్రం అసౌకర్యానికి గురికాకుండా స్వామివారిని దర్శించుకోగలిగారని పలువురు భక్తులు సంతృప్తిని వ్యక్తం చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా భక్తులకు మజ్జిగ, తాగునీరు, అల్పాహారం పంపిణీ చేయడంపై భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మొదటి పేజీ తరువాయి

### భారత్-బ్రిటన్ సంబంధాలకు నూతన జవసత్వాలు

మనం కలిసి పని చేయగలమని ఆశిస్తున్నట్లు తెలిపారు. భారత సంతతి ప్రజలు సెయింట్ జేమ్స్ కోర్టు హోటల్ వెలుపల మోదీకి స్వాగతం పలికారు. అల్బర్ట్ ఎంబాంక్‌మెంట్ గార్డెన్‌లో బసవేశ్వరుని విగ్రహానికి మోదీ పూలమాల వేసి, నివాళులర్పించారు. బ్రిటన్ ప్రిన్స్ ఛార్లెస్‌తో కలిసి మోదీ సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.

### కంభంపాటి హరిబాబుకు కొత్త పదవి

అధ్యక్ష మార్పు తప్పదన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకే రాజీనామా చేశారనేవి మరో వాదన. 2014 జనవరిలో పార్టీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన హరిబాబు పదవీకాలం గతేడాదితోనే ముగిసింది. అప్పటి నుంచి అధ్యక్ష మార్పుపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతూనే ఉంది.

కాగా, ఈ రోజు సాయంత్రానికి ఏపీ బీజేపీకి కొత్త అధ్యక్షుడిని నియమించే అవకాశం కన్పిస్తోంది. అధ్యక్ష పదవి కోసం అధిష్టానం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసి నలుగురి పేర్లతో కూడిన జాబితాను సిద్ధం చేసింది. సోమువీర్రాజు, పైడికొండల మాణిక్యాలరావు, కన్నా లక్ష్మీనారాయణ, పురంధేశ్వరి పేర్లు జాబితాలో ఉన్నాయి. వీరితో పాటు విశాఖకు చెందిన చెరువు రామకోటయ్య పేరు కూడా తెరపైకి వచ్చింది. కానీ అధిష్టానం మాత్రం వీర్రాజు, పైడికొండలలో ఎవరో ఒకర్ని ఖరారు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

### ప్రపంచంలో అత్యంత అందమైనది బాలల చిరునవ్వే

చేటేనని పేర్కొన్నారు. మనం ఎలాంటి సమాజాన్ని నిర్మించుకుంటున్నామో ఆలోచించుకోవాలన్నారు. అటువంటి సంఘటనకు బాలిక కానీ, మహిళ కానీ గురి కాకుండా చర్యలు తీసుకోవలసిన బాధ్యత మనకు ఉందన్నారు. బాలల ముఖంపై చిరునవ్వే ఈ ప్రపంచంలో అత్యంత అందమైనదని చెప్పారు. బాలలకు రక్షణ కల్పించడమే మన సమాజానికి గొప్ప విజయమని తెలిపారు. వారికి భద్రత కల్పించి, తమకు రక్షణ ఉన్నదనే భావం వారిలో కల్పించడం సమాజం బాధ్యత అని తెలిపారు.

ఈ సందర్భంగా మహిళలు సాధిస్తున్న విజయాలను, వారి వల్ల మన దేశానికి లభిస్తున్న కీర్తి, ప్రతిష్ఠలను రామ్‌నాథ్ కోవింద్ గుర్తు చేశారు. భారతీయ బాలికలు ఇటీవలి కామన్వెల్త్ గేమ్స్‌లో గొప్ప విజయాలు సాధించి, మన దేశానికి మంచి పేరు తీసుకొచ్చారన్నారు. మానిక బాత్రా, మేరో కోమ్, మీరాబాయ్ చాను, సంగీత చాను,మను భకర్, వినేష్ ఫోగట్, సైనా నెహ్వాల్, హీనా సిద్ధు మన దేశానికి కీర్తి సంపాదించిపెట్టారన్నారు.

### మోదీజీ.. మాట తీరు మార్చుకోవాలి


అదే మౌన సూత్రాన్ని మోదీ పాటిస్తున్నారు. అప్పుడు నాకిచ్చిన సలహానే ఇప్పుడు మీరు పాటించండి. ఒకసారి ఆ సందర్భాన్ని గుర్తు చేసుకోండి. దేశ వ్యాప్తంగా కల్లోలం సృష్టిస్తున్న అంశాలపై మీరెందుకు మౌనం వహిస్తున్నారు? అత్యాచార ఘటనలపై నోరు విప్పరేం? మీ ప్రభుత్వం కూడా మీదారిలోనే నడుస్తున్నట్లుంది. నాకు మాటలు రావు అని హితబోధ చేసి మీరు మౌనం పాటిస్తున్నారా? ఇప్పుడు దేశంలో జరుగుతున్న అత్యాచారాలపై నేనే నోరువిప్పి మిమ్మల్ని ప్రశ్నిస్తున్నాను. మీరింత వరకూ వాటిపై మాట్లాడకపోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మీరు ఒక ప్రధాని హోదాలో ఉన్నారన్న విషయం మర్చిపోయినట్లున్నారు. మీకు త్వరలోనే జ్ఞానోదయం కావాలని కోరుకుంటున్నాను. అని అన్నారు.

బ్యాంకింగ్ మోసాలు, మైనారిటీ, దళితులపై జరుగుతున్న అరాచకాలపై నోరు మెదపరెందుకు? మహిళలపై, పిల్లలపై జరుగుతున్న అరాచకాలకు మీరిచ్చే సమాధానమేంటని ప్రధానిని మన్మోహన్ సూటిగా ప్రశ్నించారు. దీనిపై త్వరగా స్పందించకపోతే ప్రజల ఆగ్రహానికి బలికాక తప్పదని హెచ్చరించారు. అంతేకాకుండా దేశ ప్రధాని హోదాలో ఉన్న మోదీ తన మాట తీరును మార్చుకోవాలన్నారు. ఆయన మాటల వల్ల సమాజానికి తప్పుడు సందేశం వెళుతుందన్నారు మన్మోహన్‌సింగ్.

## కాస్టింగ్ కౌచ్ ఉందని ఇప్పుడే తెలిసిందా?: నాగబాబు



హైదరాబాద్: కాస్టింగ్ కౌచ్ గురించి నాగబాబు మాట్లాడుతూ... కాస్టింగ్ కౌచ్ అనేది ఉందన్న విషయం ఇప్పుడే తెలిసిందా? అని నాగబాబు ప్రశ్నించారు. ఇది గొప్ప విషయమని ఎవరూ అనుకోరని, దరిద్రమైనదని అందరికీ తెలుసునని ఆయన అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సినిమా ఇండస్ట్రీ అనేది ఓ మినీ ప్రపంచమని, ఈ ప్రపంచంలో ఏం జరుగుతుందో.. సినిమా ఇండస్ట్రీలో కూడా అదే జరుగుతుందన్నారు. ఇక్కడ కూడా మనుషులే ఉంటారని, దేవుళ్లు కాదని నాగబాబు అన్నారు. మహిళలకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అద్భుతమైన హక్కులు ఇచ్చిందని అమ్మాయిలను వేధింపులకు గురిచేస్తే వాళ్లను అరెస్టు చేయించే హక్కుందని, ఇండస్ట్రీలో ఎవరైనా ఒక అమ్మాయికి ఇన్‌డీసెంట్‌గా ప్రపోజ్ చేస్తే... పీఎస్‌లో ఫిర్యాదు చేస్తే... విచారణ జరిపి పోలీసులు చర్యలు తీసుకుంటారని, అలాగే న్యాయవ్యవస్థ ఉందన్నారు. పోలీస్ స్టేషన్లకు, కోర్టులకు వెళ్లమంటే మరెక్కడికి వెళతారని నాగబాబు ప్రశ్నించారు. చర్యలు తీసుకునే అధికారం తమకు లేదని, చట్టాలన్ని చేతుల్లోకి తీసుకోలేమన్నారు. కాస్టింగ్ కౌచ్‌పై కమిటీ ఉండాలని అడిగారని, దీన్ని మనస్ఫూర్తిగా ఒప్పుకుంటున్నామని, అయితే కొంత సమయం పడుతుందన్నారు. మహిళలపై లైంగిక దాడులకు తాను వ్యతిరేకమని, అయితే తనేమి చేయలేనని నాగబాబు అన్నారు. అలాగని ఇండస్ట్రీ మొత్తాన్ని బ్లేమ్ చేయడం సరికాదని, 10 శాతం వెధవలు ఉంటే, 90 శాతం మంచివాళ్లే ఉన్నారని ఆయన అన్నారు.










### ఒకటి నుంచి జ్ఞానధార కార్యక్రమం

రోలుగుంట : చదువులో వెనుకబడిన పిల్లల కోసం ప్రభుత్వం మే 1 నుంచి జ్ఞానధార కార్యక్రమం నిర్వహిస్తోందని ఎంఇఒ కిరణ్మయి తెలిపారు. ఐదు నుంచి ఆరో తరగతికి, తొమ్మిది నుంచి పదో తరగతికి వచ్చే పిల్లల్లో చదువులో వెనుకబడిన 150 మందిని ఎంపిక చేసి వేసవి నెల రోజుల పాటు ప్రత్యేక శిక్షణ తరగతులను ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ఇందుకు మండలంలోని స్థానిక కస్తూర్భా గాంధీ విద్యాలయ భవనాన్ని ఎంపిక చేశారన్నారు. వీరికి ఉచిత భోజనంతో పాటు వసతి కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

### ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

నాతవరం : మండలంలో గన్నవరం మెట్ట గ్రేసియన్ స్కూల్ వద్ద బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జోసఫ్ మెమోరియల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అవసరమైన వారికి కళ్ల అద్దాలు అందించారు.

## పవన్ కల్యాణ్‌కు బహిరంగ క్షమాపణ చెప్పిన శ్రీరెడ్డి







హైదరాబాద్: సినీ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ గురించి ఆరోపణలు చేస్తూ సంచలనంగా మారింది నటి శ్రీరెడ్డి. మాలో తనకు సభ్యత్వం ఇవ్వలేదని అర్ధనగ్న ప్రదర్శన చేయడంతో ప్రస్తుతం తెలుగు సినీ పరిశ్రమ అట్టుడికి పోతోంది. సినీ ప్రముఖులు ఒక్కొక్కరుగా ఈ విషయమై స్పందిస్తున్నారు. ఇదే కోవలో నటుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా స్పందించారు. అయితే పవన్ స్పందనకు సంతృప్తి చెందని శ్రీరెడ్డి వాడకూడని పదజాలంతో బహిరంగంగా దూషించింది. అయితే పవన్ అభిమానులే కాకుండా సినీ ఇండస్ట్రీ నుంచి కూడా శ్రీరెడ్డిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి.

దీంతో శ్రీరెడ్డి తన వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేసింది. పవన్ కల్యాణ్‌కు ఆయన తల్లికి బహిరంగ క్షమాపనలు చెబుతున్నట్లు సోషల్ మీడియా ద్వారా స్పందించింది. అనుకోకుండా మనం చాలా మందిని బ్లేమ్ చేశాము. నేను వారికి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నాను. కొంత మంది మీ శత్రువులు మంచితనం ముసుగులో ఇలాంటివి చేయమని ఎంకరేజ్ చేశారు. నేను ఏ పార్టీకి చెందిన వ్యక్తిని కాదు. పొరపాటుగా దొర్లిన నా తప్పిదాన్ని మన్నించి మీరు, మీ అభిమానులు వాస్తవాన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను.

# గీతం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధనల్లో అగ్రస్థానం



విశాఖపట్నం : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి అనుబంధంగా గల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం బోధనతో పాటు పరిశోధనల్లో అగ్రస్థానంలో ఉందని దాదాపు 8కోట్ల రూపాయిల విలువైన పరిశోధనా ప్రాజెక్టులు నిర్వహణలో ఉన్నాయని విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎమ్ఆర్ఎస్ సత్యానారాయణ వెల్లడించారు.బుధవారం గీతం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం వార్షిక బులెటిన్ విడుదల సందర్భంగా ఆయిన మాట్లాడుతూ ప్రతిష్టాత్మక సంస్థలైన భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి), దేశ రక్షణ పరిశోధనా అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ), హిందుస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్ వంటివి తమకు పరిశోధనాప్రాజెక్టులను కేటాయించాయన్నారు. స్థానిక ప్రరిశ్రమలకు కన్సల్టెన్సీ సేవలను సహితం తమ విభాగం ద్వారా అందిస్తున్నామన్నారు. నానో లుబ్రికెంట్స్, నానో కోటింగ్స్, వైబ్రేషన్ మానిటరింగ్, మెటల్ కటింగ్ వంటి అంశాలపై పరిశోధనలు చేపట్టామన్నారు. గీతం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రయెగశాలలు అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దామని వెల్లడించారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మిప్రసాద్ మాట్లాడుతూ బిటెక్‌తో పాటు నిర్వహిస్తున్న ఎమ్‌టెక్ మెషిన్ డిజైన్, క్యాడ్, కామ్ కోర్సులలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో జరిగే 'గేట్ 'ప్రవేశపరీక్షలో ర్యాంకులు సాధించిన వారికి ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు.

మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సుకు ఉన్న డిమాండ్ దృష్యా విద్యార్థులకు పరిశ్రమలలో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వడాన్ని అభినందించారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు జీవిత బీమా సేవలు

## సంయుక్త సంచాలకులు జి.మణిశేఖర్

విశాఖపట్నం: ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీమా సేవలను అందిస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా పథకం (ఎపిజిఎల్ఐ) కార్యాలయ సంయుక్త సంచాలకులు జి.మణిశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు జిఓఎంఎస్.నెం.36, తేది 5-3-2016 ప్రకారం 21 సంవత్సరాల వయస్సు నుండి 55 సంవత్సరాల వయస్సు వరకు గల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారి మొదటి నెల జీతం నుండే వారి బేసిక్ పే ప్రకారం ఎపిజిఎల్ఐ ప్రీమియంను రికవరీ చేసి బీమా పాలసీ ప్రతిపాదనలను కార్యాలయానికి తప్పనిసరిగా పంపి పాలసీ బాండ్లను పొందాలన్నారు.

ప్రీమియంను పెంచినప్పుడు ప్రతిసారి పెంచిన మొత్తానికి అనుగుణంగా ప్రతిపాదనలను సమర్పించి పాలసీలను పొందాలన్నారు. ఆ విధంగా జరిగినప్పుడు బీమా అనేది ప్రతిపాదకునికి, ఎపిజిఎల్ఐ శాఖకు మధ్య జరిగే కాంట్రాక్ట్ కనుక పరిణతి లేక మరణం సంభవించినప్పుడు బీమా ప్రయోజనాలను నష్టపోవల్సి వస్తుందన్నారు. ఏమైనా న్యాయపరమైన చిక్కులు భవిష్యత్తులో ఏర్పడినట్లయితే సంబం ధిత డిడిఓ పూర్తి బాధ్యత వహించాల్సి వుంటుందన్నారు. ఎపిజిఎల్ఐ శాఖ ఎలాంటి ఆర్థిక భారం వహించదన్నారు.

ప్రతి ప్రీమియంనకు సంబంధించిన ప్రతిపాదలకు ఒకే పాలసీ సంఖ్యతో ఎబిసిడి మొదలగు బాండ్లుగా అందజేయడం జరుగుతుందని, పాలసీదారులు తాము చెల్లిస్తున్న ప్రీమియంనకు సరిపడ పాలసీ బాండ్లు పొందినది లేనిది సరిచూసుకొని ప్రతిపాదన ఫారాలను పంపాలన్నారు.

ఎపిజిఎల్ఐ శాఖకు సంబంధించిన పాలసీదారుల చందా నమోదు వివరాలు, అన్ని దరఖాస్తులు మరియు ఇతర సమాచారాన్ని వెబ్‌సైట్ నుండి పొందవచ్చునని సంయుక్త సంచాలకులు తెలియజేస్తున్నారు.

# ఈనెల 20న చంద్రబాబు దీక్షను విజయవంతం చేయాలి

సనపల పాండురంగారావు





మాధవధార : విశాఖనగర టిడిపి అధికార ప్రతినిధి సనపల పాండురంగారావు అద్వర్యంలో కేంద్రప్రభుత్వం(బిజెపి) ఆంధ్ర రాష్ట్ర తెలుగు ప్రజలను మోసం చేసి విభజన హమిలను నేరవేర్చకుంట ప్రదాని నరేంద్రమోడి మొండి వైకరికొ నిరసనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా ఈ నెల 20వ తేదిన అమరావతిలో నిర్వహించనున్న అమరణ నిరహర దీక్షకు మద్దతుగా బుదవారం 39వ వార్డు బిర్లా జంక్షన్‌లో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద మాధవధార నుండి ర్యాలీగా వచ్చి చంద్రబాబు దిక్షను విజయవంతం చేయ్యాలని సనపల పాండురంగారావు పిలుపునిస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సనపల పాండురంగారావు మాట్లాడుతూ ప్రజా సంఘులు, కుల సంఘులు, స్వచ్ఛంద సేవా సంఘులు, వివిద ప్రజా సంఘులు, రాజకీయ పార్టీలు, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హెూదా కోసం ప్రతి ఒక్కరు కూడా చంద్రబాబునాయుడు దీక్షకు మద్దుతును ఇవ్వాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి సనపల పాండురంగారావు, నగర తెలుగు యువత కార్యదర్శి మూల రాము, తెలుగుదేశం పార్టీ నాయకులు బి.చక్రవర్తి, ఎం.శ్రీనువాసరావు, ఎస్. నరసింగరావు, నాగరాజు తదితర కార్యకర్తలు పాల్గొని చంద్రబాబునాయుడు దీక్షను విజయవంతం చేయ్యాలని నినాదాలు చేశారు.

# పరీక్ష కేంద్రాల పరిశీలన

వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న వీసీ నాగేశ్వర రావు

ఆంధ్రా యూనివర్శిటీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం పరీక్ష కేంద్రాలను బుధవారం ఉదయం వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు తనిఖీ చేశారు. ఏయూ దూరవిద్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఎంపిఇడి నాల్గవ సెమిష్టర్ పరీక్ష కేంద్రాలను వీసీ నాగేశ్వర రావు పరిశీలించారు. పరీక్ష జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా గమనించారు. పరీక్షను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం వీసీ దూరవిద్య కేంద్రంలోని పలు విభాగాలలో తనిఖీ చేశారు. విభాగానికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు సత్వర సేవలు అందించాలని సూచించారు. విభాగాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.

# భీమిలి వైకాపా లో వర్గ పోరు

భీమునిపట్నం : రాష్ట్రంలో వైకాపా కి ఆదరణ పెరుగుతున్న తరుణం లో భీమిలి నియోజకవర్గం వైకాపా పార్టీ నాయుకులు సమైఖ్యంగా ముందు కు సాగకుండా కీచులాటలతో కాలం గడుపుచున్నారు. టి.డి.పి.కి బలా దిక్యం కల్గిన భీమిలి నియోజకవర్గం లో టి.డి.పి.ని డీ కొని ఈసారి అధికారాన్ని దక్కించుకోవాలని వైకాపా అధినాయుకులు ప్రయత్నిస్తున్న తరుణంలో స్థానిక నాయకత్వం అందుకు బిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం సమన్వయ కర్త గా వున్న సమయం లో పార్టీ నాయుకులు కలిసికట్టుగా వుండే వారు తరువాత మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అక్రమాని విజయనిర్మలను సమన్వయ కర్త గా నియమించిన తరువాత పార్టీలో మనస్పర్ధలు వచ్చాయి. ప్రభుత్వం వ్యతిరేక విదానాలు నిరసిస్తూ వైకాపా నాయుకులు చేసే ప్రయత్నాలు, ఆందోళనలు,రాస్తారోకాలకు ఈ నాయుకులు వేరు వేరు గా పాల్గొంటున్నారు. భీమిలి నియోజకవర్గం లో ఈసారి ఎలాగైనా పాగా వేయాలని వైకాపా శ్రేణులు తలపోస్తున్న తరుణంలో స్థానిక నాయుకులు విభిన్న దోరణలతో ప్రవర్తించుచూ చికాకు కలిగిస్తున్నారు. ఈ విషయం లో వైకాపా అదిష్టానం స్పందించి నాయుకులు మధ్య సమన్వయం కుదుర్చి పార్టిని ఏకతాటి మీద నడిపించాలని పార్టీ వర్గాలు కోరుతున్నాయి.

సింహాద్రి అప్పన్న ప్రచార సమైఖ్య అద్వర్యంలో

# భక్తులకు మజ్జిక, బిస్కెట్స్ పంపిణీ




మాధవధార : బోగాపురంలో నిర్మించనున్న ఎయిర్‌పోర్టుకు సింహాద్రి అప్పన్న పేరును నామకరణం చేయ్యాలని కోరుతూ చందనోత్సవం సందర్భంగా సింహచలం దగ్గరలో ఉన్న గోశాల వద్ద బుదవారం మాధవధార సింహాద్రి అప్పన్న ప్రచార సమైఖ్య అద్వర్యంలో భక్తులకు మజ్జిక, బిస్కెట్స్, నీరును పంపిణి చేశారు. ఈ సందర్భంగా మాధవధార సింహాద్రి అప్పన్న ప్రచార సమైఖ్య ప్రతినిధి సనపల నారాయణస్వామి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల అరాధ్యదైవం సింహాద్రి అప్పన్న పేరును బోగాపురంలో నిర్మించనున్న ఎయిర్‌పోర్టుకు నామకరణం చేయ్యాలని దీనికి భక్తుల సపోర్టు ఎంతో అవసరమని అన్నారు. భక్తులకు కరపత్రాల ద్వారా వివరించారు. ఉత్తరాంధ్రాకు ఎంతో పేరు ప్రఖ్యాతలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాధవధార సింహాద్రి అప్పన్న ప్రచార సమైఖ్య సభ్యులు జివి.రమణ, పేడాడ సత్యనారాయణ, బి.మధు, సనపల రామన్న, సనపల రవికుమార్‌స్వామి, సనపల భానుప్రకాశ్ తదితరులు పాల్గోన్నారు.


ఈస్ట్ కోస్ట్ రైల్వే

ఇంజనీరింగ్ పని

(1) టెండరు ప్రకటన నెం. eT-East-WAT-06-2018, తేది. 12.04.2018

పని పేరు: వాల్తేరు డివిజన్‌లో పలాస-విశాఖపట్నం మెయిన్ లైను నందు పలాస-నెల్లిమర్ల మధ్య కి॥మీ 678.00 నుండి కి॥మీ 790.00 వరకు (ప్యాచెస్‌లో) అప్ & డౌన్ లైన్లుపైన 68.50 కి॥మీ పొడవు మరియు RV లైను నందు కోమటిపల్లి-విజయనగరం స్టేషన్స్ మధ్యన కి॥మీ 442.85 నుండి కి॥మీ 456.000 వరకు అప్‌లైను మరియు కి॥మీ 432.74 నుండి కి॥మీ 433.41 వరకు డౌన్ లైనుపైన (ప్యాచెస్‌లో) 3.068 కి॥మీ పొడవు కొరకు డీప్ స్క్రీనింగ్ మరియు నిర్ణీత ప్రయాణంనకు కంకర కుషన్ పెంచుటతోపాటు త్రూ కంకర రిన్యూవల్.

పని విలువ సుమారు: ₹ 1,76,47,424.24, బయానా: ₹ 2,38,240.00, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ 5,900/-, పని పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు) నెలలు.

(2) టెండరు ప్రకటన నెం. eT-East-WAT-07-2018, తేది. 12.04.2018

పని పేరు: 1. వాల్తేరు డివిజన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/విజయనగరం వారి పరిధిలో పలాస-విశాఖపట్నం లైను నందు విజయనగరం-అలమండ స్టేషన్స్ మధ్య అప్‌లైను, డౌన్ లైను మరియు మిడిల్ లైను పైన 36.747 కి॥మీ పొడవునకు PSC-14 స్లీపర్లుపైన ప్రస్తుతం వేయబడివున్న 60KG 90 UTS రైల్స్‌ను కొత్త 60KG UTS రైల్స్‌తో TRR (ప్రైమరి).
(2) వాల్తేరు డివిజన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/విజయనగరం వారి పరిధీలో డొంకినవలస-విజయనగరం RV లైను పైన గరుడుబిల్లి-గొట్లాం స్టేషన్స్ మధ్యన కి॥మీ 454.00 నుండి కి॥మీ 458.00 వరకు & కి॥మీ 459.00 నుండి కి॥మీ 460.00 వరకు అప్ లైను పైన 5.00 కి॥మీ పొడవు కొరకు PSC-14 స్లీపర్లుపైన ప్రస్తుతం వేయబడి ఉన్న 60KG 90 UTS రైల్స్‌ను కొత్త 60KG UTS రైల్స్‌తో TRR (ప్రైమరీ).
(3) వాల్తేరు డివిజన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/విజయనగరం వారి పరిధీలో వాల్తేరు డివిజన్‌లో వివిధ ప్రదేశములు వద్ద ప్రస్తుతమున్న 183 నెంబర్లు 52 KG/60 KG SEJలు PSC స్లీపర్లుపైన వేయబడినవి కొత్త మెరుగైన SEJలతో త్రూ SEJ రిన్యూవల్ (ప్రైమరి) & వాల్తేరు డివిజన్‌లో ప్రస్తుతమున్న 357 నెంబర్లు 52KG /60KG గ్లూడ్ జాయింట్స్‌ను కొత్త 52KG / 60KG గ్లూడ్ జాయింట్స్‌తోటి త్రూ గ్లూడ్ జాయింట్ రిన్యువల్‌నకు సంబంధించిన పి.వే మిసిలేనియస్ పనులు.

పని విలువ సుమారు: ₹ 1,49,03,918.72, బయానా: ₹ 2,24,520.00, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ 5,900/-, పని పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు) నెలలు.

టెండరు ముగింపు తేదీ & సమయం: (అన్ని టెండర్లకు) 24.05.2018న 1330 గంటలు

ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికి అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించవడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు http://www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 15 (పదిహేను) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇంజనీరింగ్), వాల్తేరు.

PR-36/J/18-19


# హెూదాకు పోరాటాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



అనకాపల్లి : ప్రత్యేక హెూదా కు సంబంధించి ప్రజల్లోకి తెదేపా చేస్తున్న ప్రయత్నాలను తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లు తెదేపా నగర కమిటీ ఉపాధ్యక్షులు మళ్ల సురేంద్ర తెలిపారు. చంద్రబాబును కలిసిన తమకు హెూదాకు సంబంధించి ధర్నాలు, సైకిలు ర్యాలీలు చేపట్టాలని తెలిపినట్లు తెలిపారు. ఈ మేరకు బాధ్యతలను చక్కగా చేపట్టాలని వివరించినట్లు వెల్లడించారు.

ఎమ్మెల్యే పీలా గోవిందుతో కలవగా తమకు ఈ ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.

# విశాఖలో జ్యూయల్ వన్ షోరూం ప్రారంభం





విశాఖపట్నం: ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా జ్యూయల్ ఒన్ సంస్థను విశాఖలో బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిధులు పైలా కృష్ణ ప్రసాద్ షోరూం, గోల్డ్ కౌంటర్ సిఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, డైమండ్ కౌంటర్ హీరాపన్నా జ్యూయలర్స్ అధినేత సురేష్‌కుమార్ జైన్, సిల్వర్ కౌంటర్ కంకటాల మల్లిక్ ప్రారంభించారు. అగ్రహారపు అమ్మడు మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా పోటీ ప్రపంచంలో నాణ్యమైన బంగారాన్ని అతి తక్కువ ధరలకే అందించేందుకు విశాఖలో తొలిసారిగా జ్యూయల్ వన్ సంస్థను స్థాపించినట్లు విశాఖ బిజినెస్ అసోసియేట్ మంచుకొండ గౌతంకృష్ణ అన్నారు. తమిళనాడులో 14 రిటైల్ సోరూంలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఎస్.వాసుదేవరావు, ఎజిఎం సేల్స్&ఆపరేషన్స్ ముత్తు కుమార్, కె.శ్రీనివాసరావు, విశాఖపట్నం షోరూం మేనేజర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

20 లక్షల వ్యయంతో

# గెడ్డ రక్షణ గోడ నిర్మాణ పనులకు శంకస్థాపన



కంచరపాలెం : జివిఎంసి 40 వ వార్డు పరిది మర్రిపాలెం జ్యోతి నగర్ వద్ద 20 లక్షల వ్యయంతో గెడ్డ రక్షణ గోడ నిర్మాణ పనులకు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్ రాజు బుదవారం ఉదయం శంకస్థాపన చేశారు . ఈ మేరకు 35 మిటర్ల మేర రక్షణగోడ నిర్మాణ పనులు చెపట్టడం జరిగిం దన్నారు. తమ గ్రామంలో కొంత కాలంగా జివిఎంసి సరపర చేస్తున్న మంచినీటి కొళాయి పుర్తిగా దెబ్బ తినడంతో మంచినీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కో వల్సి వస్తుందని, అదేవిదంగా తమ గ్రామంలో వీధి దీపాలు మరమత్తులకు గురయ్యాయని అధికారు లకు సమస్యను వివరించిన వారు స్పందించటం లేదని మహిళలు ఎమ్మెల్యే కు విన్నవించారు . అందుకు స్పందించిన ఎమ్మెల్యే సంబందిత అధికారులతో నేరుగా ఫోన్ లో మాట్లాడి సమస్య పరిష్కరదిశగా చర్యలు చెప్పట్టాలని సూచించారు. కార్యక్రమంలో జివిఎంసి ఈ .ఈ నర్సింహరావు , వర్క్స ఎ .ఈ గుప్తా, బిజేపి 40 వ వార్డు అద్యక్షుడు కాళ్ళ ఆదిబాబు, వార్డు మహిళ అద్యక్షురాలు మాణిక్యమ్మ, వార్డు కార్యదర్శి సీరపు లక్ష్మణ్ రెడ్డి , ఎస్ .సి మోర్చ ఉపాధ్యక్షుడు నేల దేవుడు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.


మిలటరీ ఇంజనీర్ సర్వీసెస్

ఇ-టెండరు కోరుతూ ప్రకటన

గారిసన్ ఇంజనీర్స్ (ప్రాజెక్టు)(నేవీ) స్టేషన్ రోడ్, విశాఖపట్నం-530 004 వారు భారత రాష్ట్రపతి తరపున సింగిల్ స్టేజ్ రెండు కవర్ బిడ్ విధానంలో ఆన్‌లైన్ రేట్ బిడ్ కోరుచున్నారు.

| క్ర. సం | పనిపేరు | అంచనా ధర లక్షలలో | పూర్తి కాలం | టెండరు ఐడి |
|---|---|---|---|---|
| 1. | ఎన్ఎడి సునాబేడా, ఒడిశా వద్ద డిపో మరియు నివాస ప్రాంతంలో మురుగు లైను, సెప్టిక్ ట్యాంకు మరియు మ్యాన్ హెూల్స్‌లకు ప్రత్యేక మరమ్మతులు | 26.00 | 06(ఆరు) నెలలు | 2018_ఎంఇఎస్_183256_1 |

మరిన్ని వివరాలకై వెబ్‌సైట్: eprocuremes.gov.in/eprocure.gov.in చూడగలరు.

గమనిక:-

1. వార్తా పత్రికలలో ప్రచురించబడిన ప్రకారం బిడ్లు కోరుతూ ప్రకటన టెండరు/బిడ్ డాక్యుమెంట్ ప్రకటనలో నమూనా భాగం కాదు.

2. టెండరు (ఐటమ్స్ రేట్/ఏక మొత్తము) రకం వర్తిస్తుంది మరియు బిడ్ సిస్టమ్ స్వీకరించు అధికారిచే నిర్ణయించిన ప్రకారం ప్రత్యేకంగా తెలియజేయబడును.

అంగీకార అధికారి

davp 10102/11/0105/1819

# విజయభాను సంపాదకీయం

## మనుష్య రవాణా అమానవీయ చర్య

ఆధునిక సమాజంలో కూడా మనుషుల అక్రమ రవాణా జరుగుతుండటం కలిచివేస్తున్నది. ఈ అమానవీయ చర్య నేటి సామాజిక వికృత రూపానికి నిదర్శనంగా నిలుస్తున్నది. ఎప్పటికప్పుడు మనుషుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా రోజురోజుకూ ఈ అభాగ్యుల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలోనే మనుషుల అక్రమ రవాణాపై దక్షిణాసియా దేశాల రెండురోజుల అంతర్జాతీయ సమావేశం హైదరాబాద్‌లో గత శని, ఆదివారాల్లో జరిగింది. దేశంలోని ఇరువై ఆరు రాష్ట్రాల నుంచే గాకుండా మయన్మార్, థాయిలాండ్, బంగ్లాదేశ్, నేపాల్ లాంటి దేశాలనుంచి దాదాపు 150 మంది ప్రతి నిధులు పాల్గొన్నారు. ఈ సమావేశం మనుషుల అక్రమ రవాణా నిరోధానికి నిర్దిష్టంగా చేపట్టాల్సిన చర్యలను ప్రభుత్వాలకు సూచించింది. నానాటికీ పెరుగుతున్న అక్రమరవాణా కేసుల పట్ల అప్రమత్తం చేయటం ఆహ్వానించదగినది. మానవ అక్రమ రవాణాపై సరిహద్దు భద్రతా దళం రూపొందించిన నివేదికలో బంగ్లా యువతుల వ్యాపార కేంద్రంగా ముంబయి, హైదరాబాద్ ఉన్నదని ధ్రువీకరించటం ఆందోళన కలిగించేదే. పడుపు వృత్తికి భారత్ అతిపెద్ద మార్కెట్‌గా మారిందన్నది ఇంకా అవమానకర విషయం. మనుషుల అక్రమ రవాణా అనగానే సాధారణంగా మహిళలను అక్రమంగా తరలించి వారిని బలవంతంగా వేశ్యావృత్తిలోకి దింపటంగానే భావిస్తున్నారు. కానీ ఇదొక్కటే కాకుండా ఇంకా మనుషుల అక్రమ రవాణా అనేకరూపాల్లో బానిసత్వానికి కొనసాగింపుగా సాగుతున్నది. పిల్లలు పెద్దలనే తేడా లేకుండా అనేక మంది అపహరించి ఏవిధమైన రక్షణలు లేని భయంకర పరిస్థితుల్లో పని చేయిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 12 లక్షల మంది అపహరణకు గురవుతున్నారు. ఇందులో నలభై శాతం చిన్నపిల్లలే ఉండటం దిగ్భ్రాంతికరం. నేరాల నమోదు జాతీయ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) లెక్కల ప్రకారం 2014లో 5,466 కేసులు నమోదైతే, 2016లో 8,132కు చేరింది. గడిచిన పదేండ్లలో దేశంలో మానవ అక్రమరవాణా పదిహేను రెట్లు పెరిగిందని అధ్యయనాలు చెబుతున్నాయి. రోజుకు 180 మంది బాలికలు కనిపించకుండా పోతున్నారు. గల్లంతైన బాల, బాలికల జాడ మరెప్పుడూ, ఎక్క డా దొరుకటం లేదు. ఇలా గల్లంతైన వారు ఏమవుతున్నారు, ఏ పరిస్థితుల్లో ఉంటున్నారో ఊహించుకుంటేనే కడుపు తరుక్కుపోతుంది. దేశంలో 80 లక్షల మంది బాలికలు వేశ్యావృత్తిలో మగ్గుతున్నట్లు అనేక స్వచ్ఛంద సంస్థలు తమ అధ్యయనాల ద్వారా తెలియజేస్తున్నాయి. మన దేశంలో పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, సిక్కిం, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ఈ మనుషుల శరీరాలతో అమానుష వ్యాపారం జోరుగా సాగుతున్నదని అధ్యయనాలు చెబుతున్నాయి. మరోవైపు నేపాల్, బంగ్లాదేశ్ నుంచి ఇండియాలోకి యువతుల, బాలికల తరలింపు ఐదింతలు అయిందని తాజా నివేదికలు తెలియజేస్తుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. వివిధ రూపాల్లో కొన సాగుతున్న మనుషుల అక్రమ రవాణా మానవీయతను మంట కలిపి స్వార్థానికి పరాకాష్టగా నిలుస్తున్నది. చిన్న పిల్లలను భయంకరమైన పని పరిస్థితులుండే ఇటుక బట్టీలు, నూనె మిల్లులు, చెత్త ఏరే కంపెనీల్లో చీకటి గుహల్లో బంధించి పనిచేయిస్తున్న తీరు అనేక సందర్భాల్లో హైదరాబాద్ నగర శివార్లలోనే బయట పడింది. ఇక పేదరికాన్ని ఆసరాగా చేసుకొని సాగే దురాగతాలకు అంతేలేదు. హైదరాబాద్ పాతనగరంలో పేదరికాన్ని ఆసరాగా చేసుకుని పెళ్ళి ముసుగులో యువతులను తరలిస్తున్న అరబ్ షేక్‌ల దురాగతాలు తెలియనివికావు. బీహార్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని ఆదివాసుల పేదరికాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దుర్మార్గులు చేసే దురాగతాలకు అంతేలేదు. యువకులను తరలించి బానిసల కన్నా హీనంగా పనులు చేయించటం మొదలు, బాలికలను అక్రమంగా తరలించి వారితో అమానుష వ్యాపారం చేయిస్తున్నారు. ఇతర దేశాల నుంచి ముఖ్యంగా నేపాల్, బంగ్లా, థాయిలాండ్‌ల నుంచి అమ్మాయిల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నది. గత ఏడాది హైదరాబాద్‌లో 33 మంది థాయి అమ్మాయిలను వ్యభిచార కూపాల నుంచి రక్షించిన ఘటన ఇందుకు ఉదాహరణ. ఈ నేపథ్యం లో మనుషుల అక్రమ రవాణాపై దక్షిణాసియా దేశాల అంతర్జాతీయ సదస్సు చేసిన తీర్మానాలు, సూచనలు విలువైనవి. మనుషుల అక్రమ రవాణా విషయంలో న్యాయపరమైన, చట్టపరమైన భద్రతాపరమైన విషయాల్లో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని సూచించింది. మనుషుల అక్రమ రవాణాకు పాల్పడ్డవారికి ఏడాదికి మించి శిక్ష లేకపోవటంతో ఈ నేరాలకు అడ్డులేకుండాపోతున్నది.

### ఆసిఫా అత్యాచారాన్ని నిరసిస్తూ

## ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం



సబ్బవరం: దేశంలోని జమ్ము కాశ్మీర్‌లోని కదువలో 8 సంవత్సరాల బాలిక ఆసిఫా పై జరిగిన అత్యాచారాన్ని నిరసిస్తూ సబ్బవరం మూడురోడ్ల కూడలిలో బుధవారం వివేకానంద స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంఘ అధ్యక్షుడు శ్రీనివాసవర్మ అధ్యక్షతన అసకపల్లి శ్రీ గాయత్రి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఆధ్వర్యంలో చిన్నారులపై అఘాయిత్యాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో పెట్రోలింగ్ ఎస్ఐ త్రినాధరావు పాల్గొని మూడురోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి చిన్నా రుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా శ్రీనువాసవర్మ మాట్లాడుతూ ఆసిఫా మరియు మానవ మృగాల అకృత్యాలకు బలి అయిన చిన్నారులకు ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు. 8 సంవత్సరాలు ఆసిఫా అనే మైనర్ బాలికపై జరిగిన హోరానికి సభ్య సమాజం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. నేరస్తులకు కఠినమైన శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కె.వి.గణేశ్వరరావు, ప్రిన్సిపాల్ టి.రామ కుమారి, ఉపాధ్యాయులు వివేకానంద స్ఫూర్తి సెక్రటరీ డి.కె.విశ్వనాధ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బొంకులదిబ్బ యూత్ వారి ఆధ్వర్యంలో చలివేంద్రం

పరవాడ: మండల కేంద్రమైన పరవాడలో గల బొంకుల దిబ్బ యూత్ వారిఅద్వర్యంలో బొంకులదిబ్బ వద్ద బుధవారము చలివేంద్రమును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిలుగావైసిపి రాష్ట సిఇసి సభ్యులు మరియు పరవాడ ఎంపిటిసి 1సభ్యులు పైల శ్రీనువాసురావు, సర్పంచ్ చుక్క రామునాయుడు, ఎంపిటిసి2 సభ్యులుసిరపురపుఅప్పలనాయుడు ముఖ్యఅతిథిలుగా హజరైవాళ్ళుచేతులు మీదుగా ప్రారంబించారు. అనంతరము వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైలశ్రీనువాసు రావు మాట్లడుతూ వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకోని బొంకులదిబ్బయూత్ సభ్యులు చలివేంద్రముని ఏర్పాటు చేయుడము చాలా ఆనందకరంగా వుందని అన్నారు. పరవాడసర్పంచ్ చుక్క రాము నాయుడు మాట్లడుతూ చలివేంద్రాలు ద్వారా ప్రజలు దాహర్తి తీర్చడముతోపాటుఎండతీవ్రతనుంచి కొంత ఉపశమనముకలిగించినవారుఅవుతారు అని పేర్కొన్నారు.

పరవాడ ఎంపిటిసి2 సభ్యులు సిరపురపు అప్పల నాయుడు మాట్లడుతూ బొంకులదిబ్బయూత్ సభ్యులు చేస్తున్న సేవలునుకొనియాడారు.

ఈ కార్యక్రమంలో పైలహరేష్ , బండారు రామారావు, పైలఅప్పలనాయుడు, వెన్నెల సన్యాశిరావు, బొద్దపు చిన్నారావు, చీపురుపల్లి సన్యాశిరావు మరియు బొంకుల దిబ్బయూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక హెూదా కోసం కాగడాల ప్రదర్శన

### యలమంచిలి ఎమ్ఎల్ఏ పంచకర్ల



అచ్యుతాపురం: ప్రత్యేక హెూదా కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని, ప్రత్యేక హెూదా కల్పిస్తామని హామీ ఇచ్చి మాటామార్చిన కేంద్ర ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంకావాలని టిడిపి జిల్లా రూరల్ అద్యక్షులు, యలమంచిలి ఎమ్ఎల్ఏ పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. బుదవారం సాయంత్రం మండల కేంద్రమైన అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలి నుండి పూడిమడక వెళ్లే రహదారిలో ప్రత్యేక హెూదా కోసం నియోజకవర్గ టిడిపి నాయకులతో కలిసి కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. విభజన హామీల కోసం, ప్రత్యేక హెూదా కోసం పోరాడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 30న తిరుపతిలో పెద్ద ఎత్తున మహాసభ పెడుతున్నారన్నారు. కేంద్రంపై రాజీలేని పోరాటానికి ప్రజలంతా సహకరించాలన్నారు. ప్రతిపక్ష నేతలు లాలూచీ రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మెన్ దూళి రంగనాయకులు, మండల టిడిపి అద్యక్షులు జనపరెడ్డి నరసింగరావు, టిడిపి ప్రదాన కార్యదర్శి దేశంశెట్టి శంకర్రావు, మాజీ ఎమ్‌పిపి వడిశల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి బాబ్జి, లాలం నాగేశ్వర్రావు, టిడిపి నాయకులు కూండ్రపు వెంకునాయుడు, కూనిశెట్టి రమణ, వేగి మహేష్, ఆడారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బొప్పాయి, జీడిమామిడికి తెగుళ్ల బెడద

### కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సత్తిబాబు

రావికమతం : బప్పాయికి రింగ్‌స్పాట్ వైరస్, జీడిమామిడి తోటలకు పిండినల్లి వ్యాపించాయని తక్షణమే నివారణ చర్యలు చేపట్టకపోతే దిగుబడులు తగ్గే అవకాశం ఉందని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.సత్తిబాబు అన్నారు. మంగళవారం మండంలోని తోటకూరపాలెం, పోతులూరు గ్రామాల్లో పైల కన్నబాబు, దేముడు, సత్తిబాబులకు చెందిన బప్పాయి, జీడిమామిడి తోటలనపు ఆయన పరిశీలించారు. బప్పాయికి ఆకుముడత(రింగ్‌స్పాట్) వైరస్ ఆశించినట్టు గుర్తించారు. దీని వల్ల మూడేళ్లకు బదులు ఏడాదికి పంట పరిమితం అవుతుందన్నారు. ఆకుముడత తెగులు లక్షణాలు ఉన్న మొక్కలను వెంటనే గుర్తించి, పీకి, కాల్చివేయాలన్నారు. ఈ తెగులు తెల్లదోమ వల్ల వస్తుందని, ఇవిఆకుల రసాన్ని పీల్చివేస్తాయని చెప్పారు. వీటి నియంత్రణకు నీలం రంగు ఎరలను, పేనుబంక కోసం పసుపు రంగు జిగురు పూసిన కార్డులను ఎకరానికి 12-15 చొప్పున ఎత్తులో అమర్చాలన్నారు. రసం పీల్చు పురుగును గుర్తించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. లీటరు నీటికి వేప నూనె 2.5 మిల్లీలీటర్లు, అసిపేట్ 2.5 గ్రాములు, జిగురు 0.5 మి.లీ కలిపి పిచికారీ చేయాలన్నారు.

## కవి సమయం

### సత్పురుషులు

తమ పనులను కూడా విడిచి
పరుల కార్యములను చేయువారు సత్పురుషులు
తమకు కార్యభంగము కలుగక
పరుల కార్యములను చేయువారు మధ్యములు
తమ కార్యముల కొరకు
పరుల కార్యములను భంగం చేయువారు రాక్షసులు
తమకు ఏ ప్రయోజనం లేకున్నా
పరుల కార్యములను భంగం చేయువారు నామరహితులు
పుట్టలోని చెదవలె నిరర్థకులు
అతి పవిత్రము, నశ్వేరము, దుర్లభము
మానవ జన్మకు సార్థకము, దివ్యత్వము
చేకూర్చుకొనుటయే మన కర్తవ్యము

...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : ఛైత్ర ; తిథి : చవితి రా.1.26; రోహిణి రా.1.07; సా.వ.5.30ల 7.01. | గురువారం 19-04-2018

**మేషం :** బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. ముఖ్యుల రాకలు పెరుగుతాయి. ఆటోమొబైల్, ట్రాన్సుపోర్టు, మెకానికల్ రంగా లలోని వారికి చికాకులు తప్పవు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. నూతన వస్త్రప్రాప్తి ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. రుణ విముక్తులు కావడంతో మానసికంగా కుదుటపడతారు.

**వృషభం :** ఉద్యోగస్తులకు స్థానమార్పిడి, కొత్త బాధ్యతలు చేపట్టే ఆస్కారం ఉంది. రాజకీయ నాయకులు తరచు సభాసమావేశాలలో పాల్గొంటారు. బంధు మిత్రలతో పట్టింపులు ఎదుర్కొంటారు. ఉమ్మడి వ్యాపారం సౌమ్యంగా సాగు తుంది. ఆంతరంగిక సమస్యలకు పరిష్కార మార్గం కానవస్తుంది.

**మిథునం :** మీ పాత సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కొంత నిరుత్సా హానికి గురవుతారు. కష్ట సమయంలో సన్నిహితులకు అండగా నిలుస్తారు. సోదరు లతో సత్సంబంధాలు నెలకొంటాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. విందు, వేడుకలలో చురుకుగా పాల్గొని అందరిని ఆకర్షిస్తారు. కళ, క్రీడా, సాంకేతిక రంగాలవారికి ప్రోత్సాహకరం. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు, రాత పరీక్షలలో మెళకువ, ఏకాగ్రత అవసరం.

**కర్కాటకం :** కళాకారులకు రచయితలకు, పత్రికా రంగంలోని వారికి పురోభివృద్ధి కానరాగలదు. అలౌకిక విషయాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆరోగ్య సమస్యలు తప్పవు. వస్త్ర, బంగారు, వెండి రంగాలలోని వారికి సంతృప్తి కాన వస్తుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిది.

**సింహం :** ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి చికాకులు తప్పవు. శ్రమాధి క్యత వల్ల అస్వస్థతకు లోనవుతారు. కళాకారులకు, రచయితలకు, పత్రికా రంగాలలోని వారికి అనుకూలమైన కాలం. ఉపాధ్యాయులకు ఒత్తిడి పెరుగు తుంది. స్థిరాస్తి అమ్మకం చేయాలనే మీ ఆలోచన మరికొంత కాలం వాయిదా వేయడం మంచిది.

**కన్య :** నూతన దంపతులకు కొత్తకొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలకు సంబంధించిన వ్యవహారాలలో మెళకువ అవసరం. దైవ కార్య క్రమాల పట్ల ఏకాగ్రత వహిస్తారు. ప్రత్యర్థులతో రాజీ కుదురుతుంది. న్యాయ వాదులు చికాకులు ఎదుర్కొంటారు. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం.

**తుల :** కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు పనివారలతో చికాకులు తప్పవు. ధనం నిల్వ చేయాలనే మీ ఆలోచన ఫలించదు. ఉద్యోగస్తులకు బాధ్యతలు అధికం అవ్వడంతోపాటు, ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. ఆపద సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. శత్రువులు మిత్రులుగా మారుతారు.

**వృశ్చికం :** స్త్రీలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించండి. బంధువుల రాక వల్ల మీ కార్యక్రమాల్లో అంతరాయం ఏర్పడుతుంది. వస్త్ర, బంగారు, వెండి వ్యాపారస్తులకు లాభదాయకంగా ఉంటుంది. మీరు చేసే కృషి వల్ల మీ ప్రతిభ వెలుగులోకి వచ్చి మంచి విజయం సాధిస్తారు. నిరుద్యోగులకు ఆశాజనకం.


**ధనుస్సు :** చిన్నతరహా పరిశ్రమలలోని వారికి వృత్తులలోని వారికి సంతృప్తి కానవస్తుంది. మధ్యవర్తిత్వం వహించుటవల్ల మాటపడతారు. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. భాగస్వాముల మధ్య మనస్పర్థలు తలెత్తినా సమసిపోగలవు. కమ్యూనికేషన్స్, ఏజెన్సీ రంగాలలో వారికి సంతృప్తి కానవస్తుంది.

**మకరం :** పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి మార్పులే అనుకూలిస్తాయి. ప్రేమికులు ప్రతి విషయంలోనూ మితంగా వ్యవహరించడం క్షేమదాయకం. కోర్టు వ్యవహారాలు వాయిదాపడటం మంచిది. రాజకీయాలలోని వారు ప్రత్యర్థులు పెరుగుతున్నారని గమనించండి. నిర్మాణ పథకాలలో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం :** ప్రింటింగ్ రంగాల వారికి శ్రమించిన కొలదీ ఆదాయం అన్నట్లుగా ఉంటుంది. ప్రయాణాల్లోను, వాహనం నడుపుతున్నపుడు మెళకువ వహించండి. ఇంటా బయటా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటారు. ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. మీ సంతానం వైఖరి మీకు చికాకు కలిగిస్తుంది.

**మీనం :** మీరు తలపెట్టిన పనిలో ప్రోత్సాహం లభిస్తుంది. పత్రికా రంగంలో వారికి పురోభివృద్ధి కానవస్తుంది. సోదరీ, సోదరుల మధ్య అవగాహన కుదరదు. స్త్రీలకు తల, కళ్లు, నరాలకు సంబంధించిన చికాకులను ఎదుర్కొంటారు. ఉద్యో గస్తులకు పై అధికారుల నుంచి ప్రశంసలు అందుతాయి. మీ శ్రీమతి ఇచ్చిన సలహా పాటించడం మంచిది.

# సాయిబాబా చిన్న కథలు



### భక్త వాత్సల్యం

పూరిలో పూర్వము నుండి ఏదో కొంత గొప్ప పండితులమని, భక్తులమని పేరుగాంచిన పండితులకు, భక్తులకు బెంగాలు రాష్ట్రమునుండి వలన వచ్చిన మాధవదాసుకు తమకంటే ఉన్నత స్థాయి గౌరవాదరములు లభించుట చూసి ఈర్ష్యపడ్డారు. ఏదో ఒక విధముగా అతడు తమకంటే గొప్పవాడు కాడని నిరూపించుకోవాలనుకుని నిశ్చయించుకున్నారు. తమలో ఒక వ్యక్తిని ఈ పనికి నాయకునిగా ఎన్నుకున్నారు. మాధవదాసుతో, అయ్యా! మీరు చాలా గొప్ప పండితులు, భక్తులు అన్న సంగతి ఊరంతా పాకిపోయింది. మీతో వాదించాలని, తర్కించాలని మా అభిలాష అన్నాడు ఆ నాయకుడు. మాధవదాసు ఈ మాటలు విని“ అయ్యలారా! నేను పండితుడిని కాను. నా చదువు, శాస్త్ర పరిజ్ఞానం పొట్టకూటికై నేర్చినవే. మీరే నా కన్నా గొప్పవారు” అన్నాడు. అప్పుడు నాయకుడు “అయ్యా! మీరు నిజంగా పండితులు కారని నమ్మితే, ఆ విషయమును లిఖితపూర్వకముగా వ్రాసి యివ్వగలరా?” అని మాధవదాసును అడిగాడు. వెంటనే ఆనందంగా మాధవదాసు ఒక పత్రం మీద ‘నేను పండితుడ్ని కాదు’ అని వ్రాసి, తన సంతకం పెట్టి ఆ పండితుల బృందానికి ఆ పత్రము ఇచ్చాడు. ఇంకేముంది.. పండితులకు కావలసింది అదే! వారు ఆ పత్రమును తీసుకుని కాశీ మహా నగరానికి వెళ్లారు. అక్కడ పండిత సదస్సులో ఆ నాయకుడు మాధవదాసు వ్రాసిన పత్రాన్ని చూపుతూ “ పండిత వర్యులారా!! ఈ క్షణమునుండి పండితులలో నేనే శ్రేష్ఠుడను. మాధవదాసే తాను పండితుడు కాదని ఒప్పుకున్నాడు. ఇదిగో ఈ పత్రంలో మాధవదాసు వ్రాసిన సాక్ష్యమును చదువుతున్నాను. అని కాగితము మడత విప్పి బిగ్గరగా చదివాడు. అందులోని వాక్యములు అందరినీ ఆశ్చర్యపరిచాయి. పాపం! మన నాయకునికి ఏమీ తోచలేదు. ‘ఇదేమి గారడీ’ అనుకున్నాడు. ఆ పత్రములో మాధవదాసు యదార్థముగా పండితోత్తముడు అని వ్రాసి ఉంది. క్రింద ఈ నాయకుని సంతకము ఉన్నది. ప్రగల్భాలు పలికిన నాయకునికి అంతా అవగతమైనది. ఈ పత్రములో మార్పు తెచ్చినది ఎవరో కాదు! ఆ జగన్నాథుడే అని తెలుసుకున్నాడు. భక్తుల వెంట జంట కంట యింట వుండి రక్షించే బాధ్యతను ఆనందంగా స్వీకరిస్తాడు భగవంతుడు. భక్తుల పరాజయమును భక్తవత్సలుడు భరించలేడు. మాధవదాసు సార్థక నామధేయుడు

### ఆరాధన

సరస్వతీ నదీ తీరంలో ఒక గ్రామం వుండేది. ఆ గ్రామములో ఉద్దాలకుడు అనే సాధకుడు ఉండేవాడు. అతడు ప్రకృతి ఆరాధకుడు. సృష్టికర్తయొక్క అనుగ్రహమును సృష్టి ద్వారానే అనుభవించాలని అతని భావన.

... సశేషం

## సంకీర్తన



రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 విజయభాను క్లాసిఫైడ్స్ Minimum 7 days సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## బిసిల స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానం

### బిసి కార్పొరేషన్ ఇడి నాగమణి

విజయనగరం : వెనుకబడిన తరగతుల వారి నుండి స్వయం ఉపాధి పథకాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని బిసి కార్పొరేషన్ ఇడి నాగమణి బుధవారం ప్రకటనలో తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం 500 యూనిట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలకు ఆర్థికంగా వెనుకబడిన బలిజ, తెలగ, వంటరి, ఇబిసి, వైశ్యా వర్గాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన వారికి 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకు లింకేజీతో స్వయం ఉపాధిపథకాలు మంజూరు చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 21 సంవత్సరం నుండి 50 సంవత్సరాల లోపువారై యుండి తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, కుల ధృవీకరణ పత్రాలతో ఈనెల 30వ తేదీలోగా ఎపిఓబిఎంఎంఎస్ ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాపులు, కాపు వెల్‌ఫేర్ డవలెప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా, వెనుకబడిన తరగతులు వారు బిసి కార్పొరేషన్ ద్వారా, వైశ్యలు ఎపి వైశ్య కమ్యూనిటీ కార్పొరేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు బిసి కార్పొరేషన్ కార్యాలయం, విజయనగరం వారిని సంప్రదించాలని తెలిపారు.

## 20న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో నాడీ వైద్యశిబిరం

విజయనగరం : రవిశంకర్ గురూజీ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన రింగురోడ్డులో గల ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యాలయంలో నాడీవైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నామని సంస్థ రాష్ట్ర సమన్వయకర్త తుమరాడ అరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ ఉదయం 6 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు ఏర్పాటు చేసిన శిబిరంలో నాడీ పరీక్ష పేరిట వైద్యం అందించబడుతుందని, ఈ అవకాశం అందరూ సద్వినియోగం చేసుకోవాలని, పరీక్ష చేయించుకోదలచిన వారు పరీక్షకు మూడు గంటల ముందు నుండి ఎటువంటి ఆహారం తీసుకోకూడదని ప్రకటనలో తెలిపారు.

## 22న సీతారామ కళ్యాణమహొత్సవం

విజయనగరం : ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం శ్రీమద్రామయణ ప్రాంగణం రామనారాయణంలో ఈ నెల 22వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు సీతారామ కళ్యాణ మహొత్సవం జరుగుతుందని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌సిఎస్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

### పాముకాటుకు గురై

## అంగన్‌వాడీ ఆయా మృతి

చీపురుపల్లి : చీపురుపల్లి మండలం దేవరపాదిలమ్ గ్రామానికి చెందిన సీహెచ్ రమణమ్మ(47) బుధవారం పాముకాటుకు గురై మృతిచెందింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రమణమ్మ బహిర్భూమికి వెళ్లిన సమయంలో పాము కాటు వేసినట్లు చెప్పారు. చికిత్స నిమిత్తం ఆమెను చీపురుపల్లి సామాజిక ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు వారు తెలిపారు. రమణమ్మ స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తుంది.

## పిల్లలకు వర్క్ బుక్స్ పంపిణీ



భీమునిపట్నం : తగరపువలస ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల లో చదువు తున్న విద్యార్థులతో సమానంగా చదవాలనే ఉద్దేశ్యం తో ప్రభుత్వం ఉందనీ తగరపువలస పట్టణ టీడీపీ అధ్యక్షులు కొప్పులరమేష్ అన్నారు. బుధవారం తగరపువలస బంగ్లామెట్టలో ఉన్న జివిఎంసి పాఠశాల లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ పంపిన వర్క్ బుక్స్ విద్యార్థులకు పంపిణీ చేయడానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో చదువు కున్న విద్యార్థులు కంటే బాగా చదవాలనే లక్ష్యం తో ప్రభుత్వం ఉచితంగా వర్క్ పుస్తకాలు పంపిణీ చేస్తుందని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మిన సూరిబాబు, జి. చంద్రమౌళి, ఉపాధ్యాయులు అప్పలరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎత్తుబ్రిడ్జీపై రోడ్డు ప్రమాదం

విజయనగరం : స్థానిక ఎత్తుబ్రిడ్జీ వద్ద మంగళవారం అర్థరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండకరకాంకు చెందిన రాజు అనే యువకుడు గాయాలతో బయటపడ్డాడు. ఒరిస్సా నుంచి విజయనగరం మీదుగా విశాఖ వెళుతున్న భారీ వాహనానికి ఓవర్‌టెక్ చేసే ప్రయత్నంలో రాజు భారీ వాహనం క్రిందికి వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంలో మోటారుసైకిల్ నుజ్జునుజ్జు కాగా రాజుకు మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

## నేడు దుర్గాలమ్మ జాతర

యలమంచిలి రూరల్ : మండలంలోని లక్కవరం గ్రామంలో గురువారం దుర్గాలమ్మ జాతర జరుగుతుంది. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే దుర్గాలమ్మ ఆలయానికి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

# టీడీపీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం



విజయనగరం : తెలుగుదేశం పార్టీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జిల్లా పార్టీ అధ్యక్షులు మహంతి చిన్నంనాయుడు అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిఆ పొలిట్‌బ్యూరో సభ్యులు, పార్లమెంటు సభ్యులు పూసపాటి అశోక్‌గజపతిరాజు పాల్గొన్నారు. ఏప్రిల్ 20న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టిన రోజునాడు ధర్మపోరాట దీక్షకు సంఘీభావంగా అన్ని నియోజక వర్గాల్లో సామూహిక ఉపవాస దీక్షలు నిర్వహించాలని, ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులందరూ పాల్గొనాలని నిర్ణయించారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విభజన చట్టం ద్వారా రావాల్సిన హక్కులను సాధించుకునేందుకు ప్రజాపోరాటానికి ప్రజలను చైతన్యపరిచేందుకు ఏప్రిల్ 21 నుండి 15 రోజుల పాటు చేపట్టనున్న సైకిల్ యాత్ర గురించి చర్చించారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో గ్రామాలు, అన్ని మున్సిపల్ వార్డులకు కవరయ్యేలా సైకిల్ యాత్రల షెడ్యూల్‌ను రూపొందించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి, రాష్ట్ర పార్టీ పరిశీలకులు పీలా శ్రీనివాసరావు, కాకి గోవిందరెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, శాసనసభ్యులు పతివాడ నారాయణస్వామినాయుడు, కిమిడి మృణాళిని, మీసాల గీత, నియోజకవర్గ ఇన్‌ఛార్జి జనార్థన్ థాట్రాజ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శులు ఎస్ఎన్ఎం రాజు, కరణం శివరామకృష్ణ, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బొద్దుల నర్సింగరావు, రాష్ట్ర ఆర్థిక సంఘ సభ్యులు తూముల భాస్కరరావు, మాజీ శాసనసభ్యులు గద్దె బాబూరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బలగం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మహారుద్రాభిషేకం పోస్టర్ ఆవిష్కరించిన


### ఎంపి అశోక్ గజపతిరాజు

విజయనగరం : లోక కళ్యాణార్థం ఏడు అడుగుల మృత్తికా మట్టి శివలింగానికి మహారుద్రాభిషేకం కార్యక్రమాన్ని భోగాపురం పోలిపల్లి గ్రామంలో ఈనెల 29న భోగాపురం ఎంపిపి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబం ధించిన పోస్టర్‌ను బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో పార్లమెంటు సభ్యులు అశోక్ గజపతిరాజు, జిల్లా పరిషత్ చైర్మన్ శోభా స్వాతిరాణి, జిల్లా పార్టీ అధ్యక్షులు మహంతి చిన్నంనాయుడు, ఎమ్మెల్యేలు పతివాడ నారాయణస్వామినాయుడు, కమిడి మృణాళిని, మీసాల గీత, బొబ్బిలి చిరంజీవులు, ఎపిఇపిడిసిఎల్ డైరెక్టర్ శోభా హైమావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మాజీ శాసనసభ్యులు గద్దె బాబూరావు, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పీలా శ్రీనివాసరావు, ఎస్ఎన్ఎం రాజు, కరణం శివరామకృష్ణ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బలగం కృష్ణమూర్తి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# పాలిసెట్ దరఖాస్తు గడువు పెంపు

నర్సీపట్నం : పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20 వరకు గడువు పొడిగించినట్లు స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జివి.రామచంద్రరావు తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 16తో గడువు ముగియనుందని, అయితే విద్యార్థుల సౌలభ్యం కోసం 20 వరకు పొడిగించామని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# 20న రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మగౌరవ దీక్ష : మంత్రి అయ్యన్న



మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం : ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు ఆత్మగౌరవ దీక్ష చేపడుతున్నట్లు రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ప్రత్యేక హోదా విషయంలో చట్టసభల్లో ఆమోదం పొందినప్పటికీ ప్రధానమంత్రి ఇచ్చిన వాగ్దానాన్ని మర్చిపోయి రాష్ట్రానికి చాలా అన్యాయం చేయడం జరిగిందన్నారు. ఆయన నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రి విజయవాడలో దీక్ష చేస్తున్న సందర్భం అందరికి తెలసన్నారు. ఈ దీక్ష ఆయన ముఖ్యమంత్రి హోదాలో చేస్తున్నారని చెప్పారు. అదే రోజు అన్ని నియోజకవర్గాల ప్రధాన కేంద్రాల్లో ముఖ్యమంత్రికి మద్దతుగా దీక్షా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో 20న నర్సీపట్నం అబీద్‌సెంటర్‌లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలందరూ పాల్గనాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా కార్యక్రమాన్ని పార్టీపరంగా భావించివద్దని, తెలుగువారు అందరూ పార్టీలతో సంబంధం లేకుండా అన్ని పార్టీల వారు ప్రజలు అధికారులు ఉద్యోగులు కూడా దీక్షకు వచ్చి తమ మద్దతును తెలియజేయాలని మంత్రి కోరారు. ముఖ్యమంత్రిగా ఉండి దీక్ష చేయడం ఏంటని కొంత మంది విమర్శిస్తున్నారన్నారు. గతంలో ఎన్‌జి.రామచంద్రన్ సిఎంగా ఉండి దీక్ష చేశారని గుర్తుచేశారు. నరేంద్రమోదీ కూడా గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రంపై వ్యతిరేకంగా దీక్ష చేశారని చెప్పారు.ప్రత్యేక హోదా కోసం అందరూ ఏకం కావాలని ఈ విషయంలో తెలుగువారందరూ ఒకే తాటిపై నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు, మాజీ నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ లాలం అచ్చిరాజు, తాండవ రిజర్వాయర్ చైర్మన్ పారుపల్లి కొండబాబు, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్‌పిటిసి నేతల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ మొండి బకాయిలో కొయ్యూరు నెంబర్ వన్



మాట్లాడుతున్న డిఇ అహ్మద్‌ఖాన్

కొయ్యూరు : విద్యుత్ మొండి బకాయిలలో కొయ్యూరు నెంబరు వన్ స్థానంలో ఉందని నర్సీపట్నం డిఇ అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని కాకరపాడు సబ్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. ప్రత్యేక విద్యుత్ పథకాల ద్వారా అందరికి విద్యుత్ సమర్ధవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్టు ఏపిపిడిసిఎల్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.తొలిసారిగా ఆయన కాకరపాడు 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ సందర్శించారు. అక్కడ ఉన్న విద్యుత్ సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా వీలుకాని గ్రామాలకు సోలార్ ద్వారా విద్యుత్ అందిస్తున్నట్టు తెలిపారు. కాకరపాడు సబ్‌స్టేషన్‌కు రంప చోడవరం నుండే కాకుండా ప్రత్యామ్నాయంగా కేడిపేట నుండి కూడా 26కిలో మీటర్ల 9లక్షలు ఖర్చు చేసి విద్యుత్ లైను నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీని వలన మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చేయవచ్చునన్నారు. పాత మీటర్ల స్థానంలో అన్ని డిజిటల్ మీటర్లు అమర్చుతున్నట్లు తెలిపారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థకు తోడ్పడాలని తెలిపారు. మైదాన ప్రాంతంలో పోలిస్తే ఏజెన్సీ మండలాలు విద్యుత్ బిల్లులు చెల్లింపులో జాప్యం అన్నారు. విద్యుత్ మొండి బకాయిలలో కొయ్యూరు నెంబరు 1 స్థానంలో ఉందని తహశీల్దార్ కార్యాలయంలో రూ.83వేలు పిహెచ్‌సిలు 12 లక్షలు ఇలా మొత్తం కలుపుకొని మండలంలో రూ.1.30లక్షలు కొయ్యూరు మండలంలోనే ఉందని అన్నారు. డివిజన్‌లో విద్యుత్ బకాయిలు 10 కోట్లుకు పైనే ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఇ వి.లక్ష్మణరావు, ఏఇ రాజేంద్రప్రసాద్‌తో పాటు సిబ్బంది గిరి, అబ్బాయిదొర, సాంబశివరావు, మధు, రామకృష్ణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఐశ్వర్య లక్ష్మీదేవికి పంచామృతాభిషేకాలు



విజయనగరం : అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ భారతీయ తత్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో కొలువైయున్న అష్టలక్ష్మీసమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఐశ్వర్య లక్ష్మీదేవికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. బుధ వారం ఉదయం దేవాలయం ప్రధాన అర్చకులు అంపోలు లక్ష్మీ నరసింహాచార్యులు, చామర్తి రమేష్‌ల ఆధ్వర్యంలో అక్షయ తృతీయను పురస్కరించుకుని స్నపనము, పంచామృతాభిషేకాలు, అర్చనలు చేశారు.

ఈ కార్యక్రమంలో దేవాలయం ధర్మకర్త దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

## సీఎం దీక్షకు ప్రజలు మద్దతు ఇవ్వాలి


### టీడీపీ రూరల్ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు



అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా 5 కోట్ల ఆంధ్రులకు చేసిన అన్యాయానికి నిరసనగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, సిఎం నారా చంద్రబాబునాయుడు ఈనెల 20న జన్మదిన వేడుకలను జరుపుకోకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపు ధర్మ పోరాట దీక్ష చేపడుతున్నారని టీడీపీ రూరల్ జిల్లా అధ్యక్షులు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వరరావు అన్నారు. ఈ దీక్షకు సంఘీభావంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజల అందరితో కలిసి సామూహిక ఉపవాస దీక్షలు నిర్వహించాలన్నారు. ముందుగా టీడీపీ జెండాను ఆవిష్కరించి దీక్షను ప్రారంభించాలన్నారు. ప్రతీ నియోజకవర్గ కూడళ్లలో ఉపవాస దీక్ష నిర్వహించేందుకు కార్యకర్తలను, నాయకులను సమాయత్తం చేస్తున్నామన్నారు. ఉపవాస దీక్షలో పాల్గొనే పార్టీ శ్రేణులంతా తప్పనిసరిగా పచ్చచొక్కా పార్టీ సభ్యత్వ కార్డు కండువా ధరించాలన్నారు. ఉపవాస దీక్షకు నియోజకవర్గంలోని అన్ని ఉద్యోగ, కార్మిక, రైతు, మహిళ, యువత, విద్యార్థి కుల చేతి వృత్తుల సంఘాల మద్దతు కూడగొట్టి వారుకూడా దీక్షకు వచ్చి సంఘీభావం తెలిపేలా చూడాలని కోరారు. ఈ దీక్షకు అన్నివర్గాల మద్దతును కూడగొట్టాలని టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ప్రజా ప్రతినిధులకు పిలుపునిచ్చారు.

## కేంద్రం ఏపీకి ప్రత్యేక హెూదా విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ప్రకటించాలి

### -ఉక్కు అఖిలపక్ష కార్మిక యూనియన్ డిమాండ్




గాజువాక: ఏపీకి ప్రత్యేక హెూదా, విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్, విశాఖ ఉక్కుకు క్యాపిటల్ మైన్స్ వెంటనే కల్పించాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక యూనియన్ డిమాండ్ చేస్తూ బుధవారం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం ఏపీ అన్ని విధాలుగా మోసం చేస్తుందని, అలాగే ఉక్కు పరిశ్రమకు సొంత గనులను కేటాయించకుండా ఉక్కు పరిశ్రమను నీరు గార్చుతుందని ధ్వజమెత్తారు. తక్షణమే డిమాండ్‌లను నెరవేర్చాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఎఐటియు యూనియన్ నాయకులు చిత్రాడ సన్యాసిరావు, తేనేటి కృష్ణారావు, వి.ఎస్.ఎం.ఎస్ మోటూరు మహాలక్ష్మినాయుడు.హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు రెడ్డిపల్లి భాస్కర్,బొండా యోల్లాజీరావు, సామాజిక కార్యకర్తలు కాసా పద్మరాజు, నాగిరెడ్డి కృష్ణ తైనాల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర పాతనేరస్తుడు అరెస్టు

### ఐదు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

విజయనగరం : ఈమధ్యకాలంలో విజయనగరం వన్‌టౌన్ ఏరియా, డెంకాడ పోలీసు స్టేషన్ ఏరియాలో పలుదొంగతనాలకు పాల్పడిన నేరస్తుడైన కలింపేట ఉపేంద్ర అలియాస్ సంతోష్‌ను పట్టుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన నేరస్తుడు సమాచారం సిసిఎస్ డిఎస్పీ ఎ.ఎస్. చక్రవర్తి వారి సిబ్బందికి రావడంతో విజయనగరం వన్‌టౌన్ సిఐ, ఎస్ఐలు సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం విజయనగరం రైల్వేస్టేషన్ దరిలో అరెస్టు చేశారు. ముద్దాయి నుంచి ఐదు తులాల బంగారు ఆభరణాలు స్వాధీన పరుచుకోవడం జరిగిందని పోలీసు అధికారులు వివరించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికునికి ఆర్థిక సహాయం



గాజువాక: అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫౌండ్రీ వర్కర్ కొచ్చెర్ల సూర్యనారాయణ కు ప్రగతి టూవీలర్ మెకానిజమ్ వర్కర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అండగా నిల్చి ఆర్థిక సహాయం చేసింది. బుధవారం ఆసుపత్రిలో చికిత్సపొందుతన్న సూర్యనారాయణను కలిసి అషోసియోషన్ ప్రతినిధులు సుమారు రూ.5000లను అందజేసారు. ఈ కార్య క్రమంలో అషోసియోషన్ ప్రతినిధులు బాలిబోయిన శ్రీనివాసరావు, అప్పారి విష్ణుమూర్తి, గువ్వి దామోదరరావు, కోశాధికారి పి.వి.ఎస్.ఎన్ కుమార్, ఇ.గోవింద్, పి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లిలో ఏసీబీ తనిఖీలు

అనకాపల్లి : పట్టణంలోని రింగ్‌రోడ్‌లో ఉన్న గీతాంజలి అపార్ట్‌మెంట్‌లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్ కాకర్ల నాగేశ్వరరావు, ఆస్థుల కేసులో పలు చోట్ల ఏకకాలంలో జరిగిన దాడుల్లో భాగంగా ఈ తనిఖీలు బుధవారం ఉదయం నుండి నిర్వహించారు. నాగేశ్వరరావు బంధువులు ఇక్కడ ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు ఈ సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. అలాగే, విశాఖపట్నం పోతులమల్లయ్యపాలెంలో కూడా సోదాలు నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఏది ఏమైనా బుధవారం నాడు గీతాంజలి అపార్ట్‌మెంట్‌లో జరిగిన సోదాలు అనకాపల్లిలో కలకలం రేపాయి అనడంలో సందేహం లేదు.

# సత్యదేవున్ని దర్శించిన ప్రముఖులు



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ మూర్తులు రామలింగేశ్వర రావు, ఉమాదేవి, శ్రీనివాసరావు, విజయవాడ దేవస్థానం ఈవో శ్రీమతి పద్మావతి కుటుంబ సమేతముగా సత్యదేవున్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ మర్యాదలతో ఎసి ఈరంకి.జగన్నాధరావు,ఎఈవో వైయస్ఆర్ మూర్తి,ఆలయ సూపరింటెండెంట్ బలువు.సత్య శ్రీనివాస్ ఘన స్వాగతము పలికారు. దర్శనము అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందించి శ్రీ స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి. లక్ష్మీనారాయణ,సీసీ గణపతి,ఆర్ఐ భాస్కర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పీ శత వార్షికోత్సవ వేడుకలు



అమలాపురం : జిల్లా పరిషత్ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని జనుపల్లి గ్రామంలో శత వార్షికోత్సవ వేడుకలు జరిగాయి.

జనుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆత్మా ఛైర్మన్ లింగోలు వెంకన్న, గ్రామ సర్పంచ్ చుట్టుగుళ్ల జ్యోతి సత్తిబాబులచే పతాకావిష్కరణ చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఈతకోట సత్యవతి, ఉప సర్పంచ్ వేమన బాబూరావు, వార్డు సభ్యులు, జన్మభూమి కమిటీ సభ్యులు, వేమన అన్నవరం, గెడ్డం త్రిమూర్తులు, గ్రామపెద్దలు కొలిశెట్టి రామచంద్రరావు, వేమన సూరిబాబు, ఈతకోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌చార్జి కలెక్టర్ దృష్టికి పెదపల్లి సమస్య

యలమంచిలి: మున్సిపాలిటీ పరిధి పెదపల్లిలో ఇటీవల హిందువులు, క్రైస్తవుల మధ్య చోటుచేసుకున్న వివాదాన్ని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సృజన దృష్టికి ఆ గ్రామానికి చెందిన కొందరు తీసుకువెళ్లారు. ఈ మేరకు సమస్య పరిష్కరించాలని కోరుతూ విశాఖ పట్నం కలెక్టరేట్‌లో ఆమెకు వినతిపత్రం అందజేశారు. పెదపల్లి గ్రామంలో శ్రీరామ నవమి రోజున హిందువుల మనోభావాలు దెబ్బతినేలా కొందరు అసత్య ప్రచారం ఏయడంతో వివాదం చోటుచేసుకుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. పెదపల్లిలో అనధికారికంగా నిర్వహిస్తున్న ప్రార్ధనా మందిరాల విషయంలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. గ్రామంలో ఇప్పటికే ఆర్‌డిఒ సమక్షంలో రెండు సార్లు గ్రామసభలు నిర్వహించారని వివరించారు. ఈ సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బద్దపు శ్రీను, కోడిగుడ్డు రమణ, పప్పు ఈశ్వరరావు, బద్దపు నాగేశ్వరరావు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి ఏవిరెడ్డి నాయుడు ఉన్నారు.

## ఈ రోజు నుంచి ఉత్తరాంధ్ర హక్కులు సాదనకు పోరాటం

భీమునిపట్నం : చిట్టివలస బంతాట మైదానంలో జరిగి కార్యక్రమంలో అందచైతన్య పార్టీ అధ్యక్ష్యులు కంటుభుక్త. రామానాయుడు మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి కి హక్కుల సాదనకు ఈ రోజు నుంచి నాలుగురోజులు పాటు భీమిలి నియోజకవర్గం లో ఉత్తరాంధ్ర పోరు బాట నిర్వహిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో అందచైతన్య పార్టీ అధికార ప్రతినిధి కంటుభుక్త.శ్రీనివాస్, మద్దిల.రాము , సి.పి.ఐ నగర కార్య వర్గ సభ్యులు అల్లు. బాబూరావు, సి.ఐ.టి.యు. డివిజన్ అద్యక్షులు ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు

## కన్న బిడ్డ పాలిట రాక్షసుడిగా మారిన తండ్రి

**-లంచం తీసుకుని కేసు తారు మారు చేసిన పోలీసులు**

కాకినాడ:తనకు తన బిడ్డకు అత్తారింటి వారి నుండి ప్రమాదం పొంచి ఉందని కాకినాడలోని దుమ్ములపేటకు చెందిన ఓ వివాహిత ఆందోళన చేసింది తన బిడ్డను అత్తఇంటి వారు రూ5లక్షలకు అమ్మేందుకు యత్నించగా తాను ఒప్పుకొపోవడంతో తనను ఇంటి నుండి గెంటివేశరని ఆమె ఆరోపించింది ఈ విషయమై పోలీసులకు పిర్యాదు చేసినా రూ 2 లక్షలు అత్తఇంటి వారు లంచం ఇవ్వడంతో పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేసింది కావున తనకు తన బిడ్డకు వారి నుండి రక్షణ కల్పించాలని ఆ వివాహిత మీడియా ముఖంగా వేడుకొంటుంది ఇప్పటికైనా జిల్లా ఎస్పీ విశాల్ గున్నీ లంచా గొండి పోలీసులపై చర్యలు తీసుకొని బాధితురాలుకు న్యాయం చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## జడ్పీ శతాబ్ది వేడుకల పతాక ఆవిష్కరణ

కాకినాడ: జిల్లా పరిషత్ శత వసంతాల వేడుకలను జరుపుకుందామని 40వ డివిజన్ కార్పొరేటర్ సుంకర శివ ప్రసన్న పిలుపునిచ్చారు స్థానిక జడ్పీ ఓరియంటల్ పాఠశాలాలో బుధవారం జెడ్పీ శత వసంతాల పతాకాన్ని ఆమె ఆవిష్కరించారు ఉత్సావాల సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులకు విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో అర్బన్ డీఐ వాణీ కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తొండంగి మండలంలో సర్వసభ్య సమావేశం

అన్నవరం/తొండంగి: తూ.గో.జిల్లా తొండంగి మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న మండల జన్మభూమి కమిటీ ఛైర్మన్ యడ్ల బేతాళుడు(రాజా). ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న పలు అబివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లి మండల అధికారులు అందరూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని దిశ దశ నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు చిట్టిమురి సంధ్య, రాజశేఖర్, మండల అబివృద్ధి అధికారి బి.శివమూర్తి, మండలస్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## వెంకన్న అన్నదాన ట్రస్ట్‌కు 50వేలు విరాళం

రావులపాలెం : ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామంలో స్వయంభువుగా భాసిల్లుతున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు నెల్లూరు వాస్తవ్యులు డాక్టర్ వంకమామిడి వెంకటరమణమూర్తి శ్రీమతి సరస్వతి దంపతులు బుధవారం 50 వేల విరాళం అందజేసారు. ఈ సొమ్ము అన్నదాన ట్రస్ట్‌కు ఆవిరి యంత్ర సామాగ్రి కొనుగోలు చేసి ఆలయానికి అందజేయాలని తయారీదారును ఆలయ ఛైర్మన్ ఆదేశించారు. దాతలకు ఆలయ ఛైర్మన్ కరుటూరి నరసింహారావు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజులు స్వామి వారి ప్రసాదం, స్వామి వారి ఫోటోను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

రావులపాలెం : ఫాస్టర్స్ ఫెలోషిప్ (యుపిఎ) మండల కార్యవర్గం పదవీకాలం ముగియడంతో మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసారు. మండల పరిధి ఈతకోట మన్నాఫుల్ గాస్పెల్ చర్చి ప్రాంగణంలో జిల్లా కార్యవర్గం, రాజోలు రీజనల్ ఛైర్మన్ రెవ. ఐ. రవికుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎంపికైన వారిలో గౌరవ అధ్యక్షులుగా పి.ఎస్.ఎన్.మూర్తి, అధ్యక్షులుగా రెవ ఎ. క్రాంతికుమార్, ఉపాధ్యక్షులుగా రెవ. పి. అమృతరావు, సెక్రటరీగా రెవ. ఎస్.సుదర్శన్, జా. సెక్రటరీగారెవ. కె. సిమ్యోను, ట్రెజరర్ రెవ. మధుబాబు, ట్రెజరర్‌గా రెవ. ఎస్.ఎన్.రాజు, సభ్యులుగా రెవ.జి.ఎం.వి. ప్రసాదరాజు, రెవ. జి.ఆర్. ప్రకాష్‌బాబు, రెవ. కె. అడ్వర్ట్‌లు ఉన్నారు. వీరిని జిల్లా కార్యవర్గం, రీజనల్ ఛైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు.

## రెండు పాకలతో 30 మేకలు అగ్నికి ఆహుతి

రావులపాలెం : మంగళవారం స్థానిక గౌతమి గోదావరి బ్రిడ్జి వద్ద గల రెండు గొర్రెల పాకలు దగ్దమయ్యాయి. గౌతమి గోదావరి ఏటిగట్టుకు సమీపంలో కానుమోను రామరావు, సుబ్బారావులు లంక పొలాల్లో గొర్రెలు, మేకలను మేపుకుంటూ అక్కడే రెండు పాకలు వేసి వాటిలో గొర్రెలు, మేకలను ఉంచుతున్నారు. ఆ పాకల సమీపంలో పంచాయితీకి చెందిన డంపింగ్‌యార్డులో చెత్తకు నిప్పుపెట్టి ఉండడంతో మంటలు చెలరేగి పాకలకు అంటుకొని అందు ఉన్న సుమారు 30 మేకలు, గొర్రెలు ఆహుతయ్యాయి. ఈ ఘటనలో సుమారు 2 లక్షల 80 వేలు ఆస్తినష్టం సంభవించినట్లు రెవిన్యూ యంత్రాంగం తెలిపారు.

## ఇన్‌చార్జి కలెక్టర్ దృష్టికి పెదపల్లి సమస్య

యలమంచిలి రూరల్ : మున్సిపాలిటీ పరిధి పెదపల్లిలో ఇటీవల హిందువులు, క్రైస్తవుల మధ్య చోటుచేసుకున్న వివాదాన్ని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సృజన దృష్టికి ఆ గ్రామానికి చెందిన కొందరు తీసుకువెళ్లారు.

ఈ మేరకు సమస్య పరిష్కరించాలని కోరుతూ విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఆమెకు వినతిపత్రం అందజేశారు.

పెదపల్లి గ్రామంలో శ్రీరామనవమి రోజున హిందువుల మనోభావాలు దెబ్బతినేలా కొందరు అసత్య ప్రచారం ఏయడంతో వివాదం చోటుచేసుకుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. పెదపల్లిలో అనధికారికంగా నిర్వహిస్తున్న ప్రార్ధనా మందిరాల విషయంలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. గ్రామంలో ఇప్పటికే ఆర్‌డిఒ సమక్షంలో రెండు సార్లు గ్రామసభలు నిర్వహించారని వివరించారు. ఈ సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బద్దపు శ్రీను, కోడిగుడ్డు రమణ, పప్పు ఈశ్వరరావు, బద్దపు నాగేశ్వరరావు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి ఏవిరెడ్డి నాయుడు ఉన్నారు.

## రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : జిల్లాలోని ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు తదితర వర్గాల వారు ప్రభుత్వం అందించే రాయితీ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని మైనార్టీ కార్పొరేషన్ జిల్లా సంచాలకులు విఎస్.సుబ్రహ్మణ్యశాస్త్రి కోరారు. అభ్యర్థి జిల్లాకు చెందిన మైనార్టీ అయి, వయస్సు 21-55లోపు ఉండాలన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఉండాలన్నారు. సంవత్సరానికి గ్రామీణ ప్రాంతం అయితే రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాలవారికి రూ.2లక్షలు మించరాదన్నారు. అభ్యర్థులు

ఆధార్, రేషన్ కార్డు, ఒక ఫొటో, బ్యాంకు అకౌంట్ కాఫీ, ఆధార్ కార్డుతో ఇంటర్‌నెట్ సెంటర్‌లో దరఖాస్తులు చేసుకొని సంబంధిత దరఖాస్తు ప్రింట్‌ను సంబంధిత మున్సిపల్ కార్యాలయంలో, మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో స్వయంగా అందజేయాలని కోరారు. మరెన్ని వివరాలకు 0891 2502271, 9849901159నకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

# సిపియం జాతీయ మహాసభలను జయప్రదం చేయండి




**జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరించిన సిపియం నాయకులు**

పిఠాపురం : ఈ నెల 18 నుండి 22 వరకూ జరిగే సిపియం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిపియం జిల్లా కమిటీ సభ్యుడు కూరాకుల సింహాచలం పిలుపు నిచ్చారు. స్థానిక నండూరి ప్రసాదరావు భవన్‌లో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ జరుగు తుందని, అన్ని రాష్ట్రాల ప్రతినిధులు, ప్రజాప్రతి నిధులు పాల్గొంటారని తెలిపారు. దేశంలో బడుగు బలహీనవర్గాలు, రైతులు, కార్మికుల సమస్యలపై ప్రత్యేకహోదా ఇవ్వాలని మొదటి నుంచి సిపియం పోరాడుతుందన్నారు. ఈ మహాసభలకు ఆఖరి రోజు జరిగే బహిరంగ సభకు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపియం నాయకులు కరణం విశ్వనాథం, కోనేటి రాజు, కుంచే చిన్న, వి.స్టాలిన్, మోరుకుర్తి సూరిబాబు, కొజ్జవరపు నాగేశ్వరరావు, ఎదురుపాక రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ సాగర తీరంలో ఎమ్మెల్యే వాసుపల్లి వినూత్న నిరసన




విశాఖపట్నం : సింహాద్రి అప్పన్నా... మోడి మనస్సు మార్చి ఏపీకి హెూదా ఇప్పించుస్వామి అంటూ.. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రార్థించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విశాఖ సాగర తీరంలో వినూత్నరీతిలో నిరసన దీక్ష చేపట్టారు. భగభగ మండే ఎండలో కాలిపోతున్న ఇసుకలో పీకల్లోతు వరకు కూరుకుపోయి సింహాద్రి అప్పన్న నిజరూప దర్శన సైకత శిల్పం ముంగిట దీక్ష చేపట్టారు. మోడీకి కనువిప్పు కలిగించమని, రాష్ట్ర ప్రజలకోసం దీక్ష చేపడుతున్న సిఎం చంద్రబాబుకు శక్తిని ప్రసాదించు స్వామి అంటూ వేడుకున్నారు. ఈ నెల 20వ తేదీన విశాఖ కోస్టల్ బ్యాటరీ తీరంలో ఐదువేల మంది పార్టీ శ్రేణులతో నిరసన దీక్ష చేపడుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రం కోసం అలుపెరగని పోరుసాగిస్తున్న సిఎం చంద్రబాబుకు సింహాద్రి అప్పన్నే శక్తిని ప్రసాదిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ నజీర్, చోడేపట్టాబీ, బాపూ ఆనంద్, రామానంద్, బోట్టా పరదేశీయాదవ్, డొకర రమణ, యర్రబెల్లి ప్రభాకరరావు, కాసారాపు వాసు, గనగళ్ల రామరాజు, హనీఫ్ వినయ్, పిల్లి వెంకటరమణ, బంగారు రవిశంకర్, సింహాద్రి ప్రసాద్ పాల్గొన్నారు.

# అసంపూర్తిగా నిలిచిన అంబేడ్కర్ భవనం

**- ప్రజా ప్రతినిధులు ఉన్నా పూర్తి నిర్మాణానికి నోచుకోని వైనం - ఏళ్లు గతించినా కన్నెత్తి చూడని పరిణామం**

**-- భవనం పూర్తి నిర్మాణంకోసం స్థానికులు ఎదురుచూపులు**



రావులపాలెం: దళితులు అభివృద్దే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్న శుభతరుణంలో రావులపాలెంలో ఎన్నో ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిలిచిన అంబేడ్కర్ భవనం ఇప్పటికైనా నావైపు కన్నెత్తి చూస్తారా అంటూ ఆశతో ఎదురుచూస్తున్న వైనం. కోనసీమ ముఖద్వారమైన రావులపాలెం వాణిజ్యపరంగా దిన దినాభివృద్ధి చెందుతూ రాష్ట్ర స్థాయిలో స్థానం సంపాదించుకొన్నది. రావులపాలెం సెంటరు జాతీయ రహదారికి కూతవేటు దూరంలో దళితులు అధికసంఖ్యలో నివశిస్తున్నారు. గతంలో దళితుల అభివృద్ధిని కోరుకొని అప్పటి శాసనసభ్యులు బండారు సత్యానందరావు రూ.10లక్షలతో ఎమ్మెల్యే నిధులుతో అంబేడ్కర్ కమిటీ భవనాన్ని ప్రారంభించారు. అయితే నిధులు సరిపడకపోవడంతో భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. అప్పటినుండి ఎందరో ప్రజా ప్రతినిధులు మారినా, శాసించే నాయకులు గ్రామంలో ఉన్నా అసంపూర్తిగా ఉన్న అంబేడ్కర్ భవనం వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. దళితుల అభ్యున్నతికి నోచుకోలేదు. గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు అనేక పార్యాయాలు వీధుల్లో తిరుగుతున్నా అసంపూర్తిగా నిలిచిన భవనం కనిపించకపోవడం సోచనీయం. అంబేడ్కర్ భవనం ఇదేస్థాయిలో ఉంటే సిధిలావస్థకు చేరుకోవడమే కాకుండా అసాంఘిక కార్యక్రమాలకు ఆలవాలం అవుతుందని గ్రామ ప్రజలు ఆంధోళన చెందుతున్నారు. ఇప్పటికైనా దళితులు అభ్యున్నతిని కోరుకొని అసంపూర్తిగా నిలిచిన అంబేడ్కర్ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, అదేవిధంగా గ్రామంలోని అంబేడ్కర్ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం చెంతనున్న ఖాళీ ప్రదేశాన్ని సుందరంగా తీర్చిదిద్ది అంబేడ్కర్ స్మృతి వనంగా తీర్చి దిద్ది అంబేడ్కర్ ఆశయ సాధనలో ఇప్పటికైనా అధికారులు, శాశించే ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారు.

## పేకాట శిబిరంపై దాడి 8 మంది అరెస్ట్

రావులపాలెం: స్థానిక ఆర్టీసి బస్టాండు వెనుక రహస్యంగా పేకాట శిబిరంపై దాడి చేసి 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై సిహెచ్ విద్యా సాగర్ తెలిపారు. పోలీసుల ముందస్తు సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేసి వారి వద్ద నుండి 6200 నగదు స్వాధీనం చేసుకొని, వీరిని అరెస్టు చేసి కొత్తపేట మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చనున్నట్లు ఎస్సై తెలిపారు.

## పురుగుల మందు సేవించి వ్యక్తి మృతి

రావులపాలెం : మండల పరిధి పొడగట్లపల్లి శివారు జనిపిరెడ్డి వారిపాలెంలో పురుగుల మందు సేవించి ఒక వ్యక్తి మృతిచెందినట్లు ఏఎస్సై ఆర్.వి. రెడ్డి తెలిపారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జనిపిరెడ్డి వారిపాలెంకు చెందిన దంగేటి నారాయణరావు 20 సం।ల క్రితం భార్యా పిల్లలతో వెరొక ఆమెతో వెళ్ళిపోయాడని, 2017లో ఇంటికి తిరిగి వచ్చాడని, త్రాగుడుకు బానిసై తన భార్యను కొడుతూ చిత్ర హింసలకు గురి చేస్తున్నాడని, మంగళవారం మద్యం సేవించడానికి డబ్బులు అడిగాడని, భార్య దంగేటి సీత బట్టలు ఉతకడానికి కాలువ వద్దకు వెళ్ళి ఇంటికి వచ్చేసరికి తన భర్త వద్ద ఉన్న మద్యంతోపాటు పురుగుల మందు వాసన రావడంతో 108 అంబులెన్సులో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించామని, డాక్టర్ల సలహా మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని భార్య సీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

# చందన స్వామి సేవలో...
















## అతి త్వరలో బ్యాట్ పట్టనున్న స్మిత్, వార్నర్!



లండన్: క్రికెట్ ఆస్ట్రేలియా ఏడాది పాటు నిషేధం విధించిన ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్, మాజీ వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌లకు త్వరలో క్రికెట్ ఆడే అవకాశం రానుంది. సౌతాఫ్రికాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో బ్యాల్ ట్యాంపరింగ్ చేసినందుకు వీరిపై నిషేధం పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీరిద్దరు ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆడే అవకాశాన్ని కూడా కోల్పోయారు. అయితే ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు నిర్వహించే కౌంటీ క్రికెట్‌లో వార్నర్ లేక స్మిత్‌లకు ఆడే అవకాశం రావొచ్చని ఆస్ట్రేలియా మాజీ కోచ్ మైఖెల్ డి వెంటో తెలిపారు. కౌంటీ క్రికెట్‌లో వీరిద్దరిలో ఒకరిని సుర్రే జట్టులో తీసుకొనే అవకాశం ఉందని ఆయన తెలిపారు. వాళ్లద్దరు ఏదో ఒక రోజు క్రికెట్ ఆడాల్సిందే. అయితే ఈ టోర్నమెంట్‌లో వాళ్లను ఆడేందుకు అనుమతిస్తారో లేదో అన్న విషయం క్రికెట్ ఆస్ట్రేలియా వాళ్లకు విధించిన నిబంధనల మీద ఆధారపడి ఉంటుంది అని అన్నారు. సుర్రే జట్టు తరపున ఆడే ఆస్ట్రేలియా ఆటగాడు మిషెల్ మార్ష్ గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు. దీంతో సుర్రే అతని స్థానంలో ఎవరిని జట్టులోకి తీసుకోవాలనే విషయంలో సదిగ్ధంలో పడిపోయింది. ఈ నేపథ్యంలో అతని స్థానంలో వార్నర్ లేక స్మిత్‌లను తీసుకొనే ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. అయితే క్రికెట్ ఆస్ట్రేలియా స్మిత్, వార్నర్‌లు ఆ దేశంలో ప్రీమియర్ మ్యాచ్‌లతో పాటు, సమాజసేవ కోసం 100 గంటల పాటు క్లబ్ క్రికెట్‌లో ఆడే వెసులుబాటు కల్పించింది. ఈ నిబంధనలు వాళ్లకి ఆస్ట్రేలియాలో మాత్రమే వర్తిస్తాయి.. ఇతర దేశాల్లో ఎటువంటి ఆంక్షలు లేదు. దీంతో ఇంగ్లాండ్ వీళ్లు ఆడేందుకు ఎటువంటి అభ్యంతరం ఉండదనే భావిస్తున్నట్లు డి వెంటో అన్నారు. వాళ్లిద్దరు మానసికంగా క్రికెట్ ఆడేందుకు సిద్ధంగా ఉంటే, దానికి ఈసీబీ అందుకు అనుమతిస్తే.. మాకు ప్రపంచంలోనే బెస్ట్ ఆటగాళ్లు జట్టులోకి వస్తారు అని ఆయన తెలిపారు. మైఖెల్ డి వెంటో 2013-16 సమయంలో ఆస్ట్రేలియా కోచ్‌గా పని చేశారు.

# చందన స్వామిని దర్శించుకున్న ప్రముఖులు










### శ్రీవైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంనకు

## చొక్కాకుల చారిటబుల్ ఆర్థిక సహాయం



మురళీనగర్ : స్థానిక 38వ వార్డు మురళీనగర్‌లో గల శ్రీవైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంనకు చొక్కాకుల చారిట బుల్ అధ్యక్షుడు చొక్కాకుల వెంకటరావు మరియు బయోవెల్ ఫార్మా అధినేత బోకం శ్రీనివాసరావుల యొక్క ఆర్థిక సహాయంతో వెంకటేశ్వర స్వామి ప్రాంగణంనకు మొత్తం గ్రానైట్ సహాయం చేయడమైనది. ఈ సందర్భంగా పూజ్య శ్రీశ్రీశ్రీ చినజీయరుస్వామి వారి ఇరువరకు ఆలయకమిటీ సభ్యులు మరియు ప్రధాన అర్చకులు శేషాచార్యులు సమక్షంలో సాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా చినజియరుస్వామి ప్రజలు సుఖశాంతులతో ఉండాలంటే దైవబలం తప్పనిసరిగా ఉండాలి.

వారు సంపాదించిన దాంట్లో కొంతబాగాన్ని ఆలయాలకు, దానధర్మాలకు ఖర్చుచేసి వెంకటేశ్వర స్వామి కృపకు పాత్రులగుదరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చొక్కాకుల గోవింద, అర్చకస్వాములు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### 'ఆసీఫా' సంఘటనలు పునరావృతం కాకూడదు

## దోషులను కఠినంగా శిక్షించాలి

### ఆసీఫా ఆత్మకు శాంతి చేకూరాలని స్వాతి ప్రమోటర్స్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ




విశాఖసిటి: జమ్మూ కశ్మీరులో 8 సంవత్సరాల చిన్నారి ఆసిఫాని అత్యంత కిరాతకంగా లైంగిక దాడికి గురిచేసి హతమార్చిన మానవ మృగాలకు కఠినంగా శిక్షించాలని స్వాతీ ప్రమోటర్స్ అధినేత మేడిపాటి క్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆసీఫా లాంటి సంఘటనలు దేశంలో మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు. ఆసీఫా ఆత్మకు శాంతి చేకూరాలని స్వాతి ప్రమోటర్స్ ప్రధాన కార్యాలయం నుండి నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్విహించారు. అనంతరం నిందితులను శిక్షించాలంటూ నాల్గవపట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ కార్యక్రమంలో స్వాతి ప్రమోటర్స్ సిబ్బందితోపాటు వి-టీం మేనేజర్ సునీత మరియు వి-టీం ప్రతినిధులు పాల్గొన్నారు




## జ్ఞానాపూరంలో బాలుడు గల్లంతు

విశాఖపట్నం : జివిఎంసి జ్ఞానాపూరం లో గల పంపింగ్ స్టేషన్లలో 5 ఏళ్ల బాలుడు ఆడుకుంటూ జారిపడ్డారు. స్థానిక సమాచారం మేరకు శ్రీ అభయాంజనేయ స్వామి గుడి దగ్గర 44 వార్డు లో ఉన్న ఈ పంపింగ్ స్టేషన్లలో ఎల్ నవీన్ (5)తమ స్నేహితులతో ఆడుకుంటూ ఒక్కసారిగా జారిపడ్డాడు సుమారు 40 అడుగుల లోతుగల ఈ పంపింగ్ స్టేషన్లలో నీరు అతి దుర్గంధంగా ఉండడంతో స్థానికులు హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టారు .స్థానిక పోలీసులు రంగ ప్రవేశం చేసి ఫైర్ సిబ్బంది మరియు స్థానికులు. బాలుడి కోసం వెతుకుతూ సహాయచర్యలు చేపడుతున్నారు . అయితే సంబంధిత సిబ్బంది సహాయ చర్యలు సమయానికి రాకపోవడంతో బాబు బ్రతికుంటే అవకాశాలు తక్కువని స్థానికులు అంటున్నారు .

# అదనపు జేసీ ఇళ్లపై ఏసీబీ సోదాలు

విజయనగరం : ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న అభి యోగం మేరకు విజయనగరం జిల్లా అదనపు జాయింట్ కలెక్టర్ కాకర్ల నాగేశ్వరరావు ఇళ్లపై ఏకకాలంలో 10 చోట్ల అవినీతి నిరోదక శాఖ అధికారులు (ఏసీబీ) బుధవారం తెల్లవారు నుంచి సోదాలు ప్రారంభించారు. నాగేశ్వరరావు గత మూడున్న దశాబ్దాల నుంచి రెవిన్యూశాఖలో వివిధ హొదాల్లో పనిచేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా త్యాజంపూడి గ్రామానికి చెందిన నాగేశ్వరరావు రెవిన్యూ శాఖలో డిప్యూటీ తహశీల్దార్‌గా ఉద్యోగప్రస్థానం ప్రారంభించారు. అంచెలంచెలుగా ఎదిగారు. ఈ ఏడాది మే30వ తేదీన ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. కాకినాడ, ఏలూరు, విశాఖ జిల్లాల్లో తహశీల్దార్‌గా, విశాఖ, కాకినాడల్లో రెవిన్యూ డివిజనల్ అధికారిగా, అన్నవరం దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా వివిధ హొదాల్లో పనిచేస్తూ ఆరు నెలలు క్రిందట విజయనగరం జిల్లా అదనపు జేసీగా బాధ్యతలు స్వీకరించారు. సర్వీసులో అనేక చోట్ల నాగేశ్వరరావుపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని ఏసీబీ కన్నేసింది. కాకినాడ ఆర్‌డిఓగా చేస్తున్న సమయంలో ఏసీబీ నుంచి నాగేశ్వరరావు తృటిలో తప్పించుకోగా తన క్రింద ఉద్యోగి ఏసీబీకి చిక్కారు. నాగేశ్వరరావుపై అవినీతి ఆరోపణలు ఉండడంతో ఏసీబీ ఓకన్నేసింది. పక్కా సమాచారాన్ని సేకరించిన ఏసీబీ విజయనగరం లోని తన అధికారిక నివాసంలో, కార్యాలయంలో, రింగురోడ్డు ప్రాంతంలోని అపార్టుమెంట్‌తో పాటు విశాఖ సిటీలోని నాలుగుచోట్ల, అనకాపల్లి, ఏలూరు, కాకినాడ, బెంగుళూరుల్లో ఏకకాలంలో బుధవారం తెల్లవారు నుంచి ఏసీబీ అధికారులు సోదాలు ప్రారంభించారు. తన నివాసంలో ఇప్పటికే కోట్లాది రూపాయల విలువ చేసే ఇళ్లు, ఇళ్లస్థలాలు, భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు లభ్యమయ్యాయి. ఇప్పటి వరకు సుమారు 40 కోట్ల రూపాయల మేర ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు లభించాయని తెలుస్తోంది. ఇంకా లాకర్లు, బ్యాంకు



అకౌంట్లను పరిశీలిస్తున్నారు. నాగేశ్వరరావుకు చెందిన పాస్‌పోర్టును, పాన్‌కార్డును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోదాలు జరుగుతున్న మిగిలిన ప్రాంతాల్లో సైతం పలు డాక్యుమెంట్లు లభ్యమవుతున్నట్లు తెలియవచ్చింది. ఏసీబీ డిఎస్పీ షకీలాభాను, సిఐ లక్ష్మోజీల ఆధ్వర్యంలో సిబ్బంది ఈ సోదాలు నిర్వహిస్తున్నారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com